



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 349 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ బుధవారం 19 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥
VOLUME :9 ISSUE :349 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA WED 19 AUGUST 2026 PRICE : 1/- RS
Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## బీసీ రిజర్వేషన్లపై కేసులు వేస్తే చరిత్రహీనులే

### సీఎం చంద్రబాబు హెచ్చరిక

- బీసీ రిజర్వేషన్ల అంశంపై అసెంబ్లీలో ప్రసంగించిన సీఎం చంద్రబాబు
- స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరణ
- మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నిక ఇకపై ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహణ
- గత ప్రభుత్వం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని చంద్రబాబు విమర్శ
- రాష్ట్రంలో జిల్లా ప్రజా పరిషత్‌ల సంఖ్యను 13 నుంచి 28కి పెంచాలని నిర్ణయం



**పెన్ పవర్ డెస్క్:**బీసీ రిజర్వేషన్ల పునరుద్ధరణపై ఎవరైనా కోర్టుకు వెళ్లి కేసులు వేస్తే, వారు చరిత్రహీనులుగా మిగిలి పోతారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ కూటమి ప్రభు త్వం తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని అడ్డుకోవాలని చూసే శక్తులను ప్రజానీకం, చరిత్ర క్షమించవని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం శాసనసభలో బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రసంగించిన ఆయన, గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, తమ ప్రభుత్వ లక్ష్యాలను సవివరంగా ప్రకటించారు.

**కూటమి కేబినెట్ కీలక నిర్ణయాలు**

బీసీల సామాజిక, రాజకీయ అభ్యున్నతి కోసం రాష్ట్ర మంత్రివర్గం మూడు కీలక నిర్ణయాలు తీసుకుందని చంద్రబాబు తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం

- మిగతా 2లో

## మోదీపై వ్యాఖ్యలకు గట్టిగా బదులివ్వాలి

### విశాఖలో బీజేపీ శ్రేణులకు నితిన్ నబిన్ పిలుపు

- ప్రతిపక్షాలు అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్నాయని నితిన్ నబిన్ ఆరోపణ
- కాంగ్రెస్ ప్రజాస్వామ్య సంస్థలను పదేపదే అవమానిస్తోందని విమర్శ
- రాహుల్ గాంధీ ఒక పార్ట్-టైమ్ రాజకీయ నాయకుడని ఎద్దేవా
- యువత ఆకాంక్షలపై దృష్టి సారించాలని పార్టీ నేతలకు సూచన



**పెన్ పవర్ డెస్క్:** దేశంలోని ప్రతిపక్షాలు అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రతిపక్ష నేతలు ఉపయోగిస్తున్న అనుచిత భాషపై పార్టీ శ్రేణులు సంయమనం పాటిస్తూనే, పార్టీ గౌరవానికి భంగం కలగకుండా దీటుగా సమాధానం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం విశాఖపట్నంలో నిర్వహించిన ఆంధ్రప్ర దేశ్ బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజాస్వా మ్య వ్యవస్థలను

- మిగతా 2లో

## పెట్టుబడుల్లో ఏపీ దూకుడు.. దేశంలోనే 2వ స్థానం

### చంద్రబాబు విజన్ వల్లేనన్న మంత్రి లోకేశ్



- నూతన పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీకి దేశంలో 2వ స్థానం
- కేవలం 24 నెలల్లోనే 9వ స్థానం నుంచి రెండో ర్యాంకుకు చేరిన రాష్ట్రం
- సీఎం చంద్రబాబు నాయకత్వమే కారణమన్న మంత్రి లోకేశ్
- స్పష్టమైన విజన్, పారదర్శక పాలనే విజయానికి మూలమని వెల్లడి
- ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టి ఇప్పుడు ఏపీపై ఉందని వ్యాఖ్య

- మిగతా 2లో

## దేవాలయ ఉద్యోగాల్లో రాయలసీమకు అన్యాయం జరగలేదు



- రాయలసీమలోని ప్రధాన దేవాలయాల్లో 172 నియామకాలు చేపట్టామన్న ఆనం
- ఉద్యోగాల నియామక ప్రక్రియలో జోనల్ విధానం లేదని స్పష్టీకరణ
- ఖాళీలన్నీ నిబంధనల ప్రకారమే భర్తీ చేస్తున్నామని వెల్లడి

- మిగతా 2లో



## భోగాపురం వెళ్లాల్సిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

- శంషాబాద్-భోగాపురం ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు
- ఈ-మెయిల్ ద్వారా అధికారులకు అందిన సమాచారం
- ఎయిర్‌పోర్టులో సీఐఎస్ఎఫ్ విస్తృత తనిఖీలు
- బెదిరింపు మెయిల్‌పై నిఘా వర్గాల ఆరా

**పెన్ పవర్ డెస్క్:**శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం సాయంత్రం బాంబు బెదిరింపు

- మిగతా 2లో

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా వర్ల రామయ్య, దళవాయి రమ

- గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా వర్ల రామయ్య, దళవాయి రమాదేవి పేర్లు ఖరారు
- అభ్యర్థుల ఎంపికకు ఆమోదం తెలిపిన ఏపీ కేబినెట్
- ఆమోదం కోసం గవర్నర్ వద్దకు చేరిన దస్త్రం
- సీనియారిటీకి, పార్టీ సేవకు గుర్తింపునిచ్చిన టీడీపీ అధిష్ఠానం
- గత ఎమ్మెల్సీల పదవీకాలం ముగియడంతో ఏర్పడిన ఖాళీలు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థుల ను ఖరారు చేసింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సీనియర్ నేత వర్ల రామయ్య, అనంతపురం జిల్లాకు



- మిగతా 2లో



## సీఎం విజయ్ కార్యాలయం మార్పుపై దుమారం..

### టెండర్లలో అవినీతి జరిగిందంటూ ప్రతిపక్షాల మండిపాటు

- సీఎం విజయ్ కార్యాలయం ఫోర్ట్ సెయింట్ జార్జ్ నుంచి నమక్కల్ కవిజ్ఞర్ మాళిగైకి మార్పు
- రూ. 5.5 కోట్ల టెండర్ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయంటూ బీజేపీ, డీఎంకే ధ్వజం
- పాలనలో పారదర్శకత లోపించిందని ఆరోపణ

**పెన్ పవర్ డెస్క్:**తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన కార్యాలయాన్ని ఫోర్ట్ సెయింట్ జార్జ్ నుంచి నమక్కల్ కవిజ్ఞర్ మాళిగైకి మార్చాలని తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలో తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. సీఎం సిబ్బందికి సౌకర్యవంతమైన పని వాతావరణం కల్పించేందుకు ఈ మార్పు చేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించగా... కొత్త ఆఫీసు పనుల కోసం కేటాయించిన

- మిగతా 2లో

## ముగిసిన ఏపీ కేబినెట్ సమావేశం..

### బీసీ రిజర్వేషన్లు, ప్రత్యక్ష ఎన్నికలకు ఆమోదం!

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం
- స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు ఆమోదం
- పట్టణ స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్
- డెడికేటెడ్ కమిషన్ నివేదికపై లోతుగా చర్చించి నిర్ణయం
- సుమారు 55కు పైగా అజెండా అంశాలపై కేబినెట్‌లో సమీక్ష



**పెన్ పవర్ డెస్క్:**ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ సుదీర్ఘ భేటీలో పలు కీలక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ప్రధానంగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రతిపాదనకు, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలన్న నిర్ణయానికి మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు, స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం పంచాయతీరాజ్ సంస్థల్లో 34.50 శాతం, ఇతర స్థానిక సంస్థల్లో 33.50 శాతం

- మిగతా 2లో

## వందేమాతరం అలా పాడటం నేరమైతే.. గాంధీ, నెహ్రూపైనా కేసులు పెట్టండి

- వందేమాతరం వివాదంపై స్పందించిన ఖర్గే
- సోనియా, రాహుల్‌పై ఫిర్యాదును ప్రశ్నించిన ఖర్గే
- గాంధీ, నెహ్రూ పాడిన వందేమాతరమే పాడామని వివరణ
- అది నేరమైతే వారిపైనా కేసులు పెట్టాలని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:**కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వందేమాతరం వివాదంపై తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఫిర్యాదు చేయడాన్ని ప్రశ్నించారు. తాము పాడిన వందేమాతరం కొత్తది కాదని చెప్పారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్



- మిగతా 2లో

## మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తాం

- భూ లక్ష్మి పథకం కింద పేదలకు ఎకరం చొప్పున ఇస్తామన్న కవిత
- రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలేనని విమర్శ
- రాష్ట్రంలో రేవంత్, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ సాగుతోందని ఆరోపణ



- మిగతా 2లో

## ఉరి ద్వారానే మరణశిక్ష అమలు కొనసాగింపు



- ఉరి శిక్షకు బదులుగా తక్కువ బాధ కలిగించే పద్ధతులను అమలు చేయాలంటూ పిటిషన్
- ఉరి తీయడం ద్వారా మరణశిక్ష విధించే పద్ధతే చెల్లుబాటు అవుతుందన్న సుప్రీంకోర్టు
- ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించే స్వేచ్ఛ కేంద్ర ప్రభుత్వానికి ఉందని వ్యాఖ్య

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# తమ ఓట్లను జనసేన కాపాడుకోలేకపోతుందా?

జనసేనకు బూత్ స్థాయిలో కమిటీలు లేవు. మిగిలిన పార్టీల తరహాలో స్ట్రాంగ్ గా లేకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలా గట్టెక్కగలుగుతామని ఆ పార్టీ నేతలే అభిప్రాయ పడు తున్నారు. పార్టీ పెట్టిన ఇన్నాళ్ల నుంచి జనసేన క్షేత్ర స్థాయిలో బలపడలేదు. ఆ ప్రయత్నమూ పవన్ కల్యాణ్ చేయలేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో బూత్ లెవెల్ కమిటీ అవసరాన్ని గుర్తించిన నేతలు ఇప్పటికైనా నియమించకపోతే ఈ ఎన్నికల్లోనూ ఇబ్బందులు తప్పవన్న హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నిన్న అసెంబ్లీ లాబీల్లోనూ జనసేన ఎమ్మెల్యేలు ఈసారి ఖచ్చితంగా స్థానిక సంస్థ ల ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తామని, అసెంబ్లీ ఎన్నికలకు, ఈ ఎన్నికలకు పొత్తులో భాగంగా సీట్ల పంపిణీ అధికంగా ఉంటుంది. బూత్ స్థాయిలో బలోపేతం అయ్యే దిశగా జనసేన కసరత్తు షురూ చేసింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ నాయకులు ఉన్నప్పటికీ.. కీలకమైన బూత్ లెవిల్ కార్యకర్తలు జనసేనకు కొరవడ్డారు. ఆది నుంచి కూడా క్షేత్రస్థాయిలో బూత్ కమిటీల ఏర్పాటు, కార్యకర్తల నియామకంపై పార్టీ ఎప్పుడూ దృష్టి పెట్టలేదు. దీంతో క్షేత్రస్థాయిలో డెవలప్ అయ్యేందుకు పార్టీకి ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

**కనీసం నాలుగో వంతు కూడా...**

ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ, టీడీపీ క్షేత్రస్థాయిలో స్ట్రాంగ్ గా ఉన్నాయి. బూత్ లెవెల్ కమిటీలు వాటికి 175 నియోజకవర్గాల్లో ఉన్నాయి. బూత్ లెవెల్ కమిటీలో టీడీపీ టాప్ పొజిషన్ లో ఉంది. దాదాపు 47, 500 వరకూ బూత్ లెవెల్ కమిటీలను టీడీపీ ఏర్పాటు చేసుకుంది. వైసీపీ దాదాపు 45,800 కమిటీలను ఏర్పాటు చేసుకుని అది కూడా బలంగా ఉంది. కానీ జనసేనకు రాష్ట్రం మొత్తం మీద ఏడు వేల కు మించి ఇప్పటి వరకూ బూత్ లెవెల్ కమిటీలు లేకపోవడం గమనార్హం. ఈ కమిటీలు కూడా జనసేన మొన్న గెలిచిన నియోజకవర్గాల్లోనే అధికంగా ఉన్నాయి. మిగిలిన నియోజకవర్గాల్లో మాత్రం అసలు జనసేనకు బూత్ లెవెల్ కమిటీలు లేకపోవడంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా ముందుకు రావడం కష్టమేనని అంటున్నారు.

**ఎస్ఐఆర్ ప్రక్రియలోనూ...**

క్షేత్రస్థాయిలో బలోపేతం కాకపోతే ఎప్పటికీ ఇలాగే ఉండిపోతామని జనసేన నేతలు అంటున్నారు. కూటమి అధికారంలోకి వస్తే తాము ఉంటామని, లేకపోతే అది కూడా లేదని, ప్రభుత్వంలోనూ వారి పెత్తనం కిందే పనిచేయాల్సి వస్తుందన్న అభిప్రాయం జనసేన పార్టీ నేతల్లో వ్యక్తమవుతుంది. స్థానిక సంస్థల ఎన్నికలకుస్థాయి కార్యకర్తల అవసరం చాలా ఉంటుంది. అలాగే ఎస్ఐఆర్ విషయంలోనూ జనసేన అసలు పట్టించుకోలేదు. తమకు మద్దతుగా ఉన్న ఓటర్లను కనీసం కాపాడుకునే ప్రయత్నం చేయడానికి కూడా బూత్ లెవెల్ కార్యకర్తలు లేకపోవడంతో జనసేన దానిపై దృష్టి పెట్టలేకపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పవన్ కల్యాణ్ ముందుగా బూత్ లెవెల్ కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేయాలని నేతలు కోరుతున్నారు. లేకుంటే వారు ఇచ్చినన్ని స్థానాల మేరకు సరిపెట్టుకోవాల్సి ఉందన్న ఆందోళన వ్యక్తమవుతుంది.

# ముగిసిన ఏపీ కేబినెట్ సమావేశం..

## బీసీ రిజర్వేషన్లు, ప్రత్యక్ష ఎన్నికలకు ఆమోదం!

- మొదటి పేజి తరువాయి

రిజర్వేషన్లు బీసీలకు వర్తింపజేయాలని కేబినెట్ తీర్మానించింది. అయితే, బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ నివేదికపై సమావేశంలో లోతుగా చర్చ జరిగింది. కమిషన్ సిఫార్సులతో 34 శాతం రిజర్వేషన్ల లక్ష్యం నెరవేరడం కష్టమని భావించిన మంత్రివర్గం, ప్రత్యామ్నాయ మార్గాలపై సమీక్షించి తుది నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు త్వరలో జారీ కానున్నాయి.

మరో కీలక నిర్ణయంగా, పట్టణ స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అధిపతులను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానానికి కేబినెట్ అధికారికంగా ఆమోదం తెలిపింది. ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా తీసుకున్న ఈ నిర్ణయానికి తాజా సమావేశంతో చట్టబద్ధత కల్పించారు. ఈ రెండు ప్రధాన అంశాలతో పాటు, దాదాపు 55కు పైగా అజెండా అంశాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి, పలు పాలనాపరమైన, అభివృద్ధి సంబంధిత నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం.

# బీసీ రిజర్వేషన్లపై కేసులు వేస్తే చరిత్రహీనులే

- మొదటి పేజి తరువాయి

రిజర్వేషన్లు కల్పించాలని కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. దీంతో పాటు, పట్టణాల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ఎన్నికను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించామని, ఇది 'ఆయారాం గయారాం' రాజకీయాలకు తెరదించి, సుస్థిరమైన పాలనకు దోహదపడుతుందని వివరించారు. పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రంలోని 28 జిల్లాలకు అనుగుణంగా 28 జిల్లా ప్రజాపరిషత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

**ఎన్టీఆర్ స్ఫూర్తితో బీసీలకు న్యాయం**

బీసీ రిజర్వేషన్ల విషయంలో తెలుగుదేశం పార్టీకి ముందు, ఆ తర్వాత అని స్పష్టంగా చూడవచ్చని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన తర్వాతే బీసీలకు రాజ్యాధికారం దక్కిందన్నారు. 1984లో స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని గుర్తుచేశారు. ఆ స్ఫూర్తితోనే తాను 1995లో ముఖ్యమంత్రిగా యాక్ట్ ఆఫ్ 5 కింద బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించానని, 2013 వరకు జరిగిన అన్ని స్థానిక ఎన్నికల్లో ఇదే కోటాను అమలు చేశామని తెలిపారు. ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, అయ్యన్నపాత్రుడు, దేవేందర్ గౌడ్ వంటి ఎందరో బీసీ నేతలు టీడీపీ ద్వారానే బలమైన నాయకులుగా ఎదిగారని ఉదహరిం చారు. ఇప్పుడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అదే సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళుతోందని చెప్పారు.

**గత ప్రభుత్వ ద్రోహాన్ని ఎండగట్టిన సీఎం**

గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీరని ద్రోహం చేసిందని చంద్రబాబు తీవ్రంగా ఆరోపించారు. 2019లో జీవో 176 తెచ్చి నాటకాలు ఆడారని, సుప్రీంకోర్టులో సరిగ్గా వాదనలు వినిపించకుండా బీసీల హక్కులను కాలరాశారని విమర్శించారు. జీవోలు 559, 560 ద్వారా 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 24.15 శాతానికి తగ్గించి, తద్వారా సుమారు 16,800 బీసీ నాయకత్వ స్థానాలు కోల్పోయేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. "బీసీలకు ద్రోహం చేయటంలో వాళ్లు నెంబర్ వన్" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం బీసీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని చంద్రబాబు ఆరోపించారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు, పల్లా శ్రీనివాస్, కూన రవికుమార్ వంటి వారిపై అక్రమ కేసులు బనాయించి వేధించారని గుర్తుచేశారు. రేపల్లెలో అమర్నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి తగలబెట్టడం, తోట చంద్రయ్య గొంతు కోయడం, కంచర్ల జాలయ్య, నందం సుబ్బయ్య హత్యల వంటి దారుణాలను ప్రస్తావిస్తూ.. వారు సిద్ధాంతాల కోసం ప్రాణాలు అర్పించారని కొనియాడారు. బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, కనీసం కుర్చీలు కూడా వేయకుండా అవమానించారని దుయ్యబట్టారు.

**బీసీల సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళిక**

తమ ప్రభుత్వం బీసీలకు కేవలం రిజర్వేషన్లు ఇవ్వడమే కాకుండా, వారి సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. "బీసీ అంటే వెనుకబడిన వారు కాదు, అవకాశం రాక వెనుకబడిన వారు" అని అభివర్ణించారు. రాష్ట్ర జనాభాలో 50.54 శాతంగా ఉన్న బీసీల విద్య, నైపుణ్యం, ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని, వారి అద్భుతమైన నైపుణ్యాలకు టెక్నాలజీని జోడించి ప్రపంచానికి పరిచయం చేస్తామని హామీ ఇచ్చారు.

**ఎన్నికలు తక్షణావసరం**

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమని ముఖ్యమంత్రి తెలిపారు. ఎన్నికలు నిర్వహిస్తేనే 16వ ఆర్థిక సంఘం నుంచి గ్రామీణ ప్రాంతాలకు రూ.2300 కోట్లు, పట్టణ ప్రాంతాలకు రూ.1,562 కోట్ల గ్రాంట్లు వస్తాయని వివరించారు. ఇంతటి చారిత్రక సమావేశానికి వైసీపీ సభ్యులు హాజరు కాకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ చారిత్రక నిర్ణయానికి సభ ఆమోదం తెలపాలని కోరుతూ, స్థానిక ఎన్నికల్లో కూటమి నేతలంతా కలిసికట్టుగా పనిచేసి, సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించాలని పిలుపునిచ్చారు.

# పెట్టుబడుల్లో ఏపీ దూకుడు.. దేశంలోనే 2వ స్థానం

నూతన పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానానికి చేరుకుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కేవలం 24 నెలల వ్యవధిలోనే రాష్ట్రం 9వ స్థానం నుంచి 2వ స్థానానికి ఎగబాకిందని ఆయన వెల్లడించారు. ఈ ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వం వల్లే సాధ్యమైందని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, పారదర్శక పాలన, వ్యాపార నిర్వహణలో వేగం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వంటి అంశాలే ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి మూలస్తంభాలుగా నిలుస్తున్నాయి" అని వివరించారు. రాష్ట్రం వేగంగా పారిశ్రామిక శక్తిగా ఎదుగుతుండటం గర్వకారణమని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సానుకూల వాతావరణంతో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారని లోకేశ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఫలితాలను అందిస్తుండటంతో, ఇప్పుడు ప్రపంచం చూపు ఏపీ వైపు ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

# ఉరి ద్వారానే మరణశిక్ష అమలు కొనసాగింపు

మరణశిక్ష పడిన ఖైదీలకు ఉరిశిక్ష వేసే పద్ధతిని రద్దు చేసి, దానికి ప్రత్యామ్నాయంగా తక్కువ బాధ కలిగించే పద్ధతులను (విషపు ఇంజెక్షన్, కాల్చిచంపడం వంటివి) అమలు చేయాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తిరస్కరించింది. (జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. రాజ్యాంగంలోని సెక్షన్ 354(5) జతీూజ / దీమీూ 393(5) ప్రకారం ఉరి తీయడం ద్వారా మరణశిక్ష విధించే పద్ధతి చెల్లుబాటు అవుతుందని, గతంలో 3-జడ్జిల బెంచ్ (దీనా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు) ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించడానికి పెద్ద బెంచ్‌కు పంపాల్సిన అవసరం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది.

అయితే, ఈ తీర్పు అంతిమం కాదని, భవిష్యత్తులో శాస్త్రీయ లేదా వైద్యపరమైన ఆధారాలు వచ్చి ప్రత్యామ్నాయ పద్ధతులు మెరుగైనవి అని రుజువైతే ఈ అంశాన్ని మళ్లీ రాజ్యాంగబద్ధంగా సమీక్షించవచ్చని కోర్టు స్పష్టం చేసింది. అలాగే, ఉరిశిక్ష కంటే తక్కువ వేదన కలిగించే ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసే స్వేచ్ఛ కేంద్ర ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు తెలిపింది.

# దేవాలయ ఉద్యోగాల్లో రాయలసీమకు అన్యాయం జరగలేదు

రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో అర్చకులు, వేద పండితుల నియామకాల్లో రాయలసీమ ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరుగుతోందంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల భర్తీ చేసిన మొత్తం 344 పోస్టుల్లో ఏకంగా 172 పోస్టులను రాయలసీమ ప్రాంతంలోని ప్రధాన దేవాలయాల్లోనే నియామకాలు చేపట్టినట్లు వెల్లడించారు. శాసనసభలో దేవాలయాల్లో పోస్టుల భర్తీకి సంబంధించి సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి వివరంగా సమాధానమిచ్చారు. ఈ ఉద్యోగాల నియామక ప్రక్రియలో ఎలాంటి జోనల్ విధానం అమల్లో లేదని స్పష్టం చేశారు. శ్రీశైలం, మహానంది, శ్రీకాళహస్తి, కాణిపాకం వంటి సీమలోని ప్రముఖ క్షేత్రాల్లో ఉన్న ఖాళీలను నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తున్నామని తెలిపారు. ప్రాంతంతో సంబంధం లేకుండా కేవలం వేద, ఆగమ పరిజ్ఞానం, అర్హత, ప్రతిభకే ప్రాధాన్యత ఇచ్చామని మంత్రి వివరించారు. ఎంపిక విధానం అత్యంత పారదర్శకంగా జరగాలనే ఉద్దేశంతో ఇంటర్వ్యూలన్నింటినీ వీడియో రికార్డింగ్ చేయించామని పేర్కొన్నారు. రాయలసీమ జోన్-4 పరిధిలో ఇంకా ఖాళీగా ఉన్న 147 పోస్టులను కూడా త్వరలోనే నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన వెల్లడించారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా వర్ల రామయ్య, దళవాయి రమ

- మొదటి పేజి తరువాయి

చెందిన బీసీ మహిళా నేత దళవాయి రమాదేవిలను శాసనమండలికి నామినేట్ చేయాలని ఏపీ కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు సిఫార్సులతో కూడిన దస్త్రాన్ని ఆమోదం కోసం రాజ్ భవన్‌కు పంపింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఉన్న పండుల రవీంద్రబాబు, జాకియా ఖానమ్‌ల పదవీకాలం ముగియడంతో ఈ రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలో అధికార టీడీపీ, పార్టీకి సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న ఇద్దరు నేతలకు అవకాశం కల్పించింది. దళిత వర్గానికి చెందిన వర్ల రామయ్య పార్టీలో కీలక నేతగా, గతంలో ఆర్టీసీ ఛైర్మన్‌గా పనిచేశారు. పార్టీ వాయిస్‌ను బలంగా వినిపించడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2009లో తిరుపతి లోక్‌సభ స్థానం నుంచి ఆయన పోటీ చేశారు. మరోవైపు, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవి బీసీ (వడ్డెర) సామాజిక వర్గానికి చెందిన నాయకురాలు. రెండు దశాబ్దాలుగా ఆమె పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం అనంతపురం పార్లమెంట్ అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. ఆమె కుటుంబం మొదటి నుంచి టీడీపీకి అండగా నిలుస్తోంది. 2021లో అనంతపురం కార్పొరేటర్‌గా పోటీ చేసిన రమాదేవి, 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి విశేషంగా కృషి చేశారు. సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని, పార్టీకి విధేయంగా ఉన్న సీనియర్ నేతకు, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మహిళా నేతకు పదవులు ఇవ్వడం ద్వారా టీడీపీ అధిష్ఠానం స్పష్టమైన సందేశం పంపినట్టయింది. ప్రస్తుతం ఈ ఫైల్ గవర్నర్ పరిశీలనలో ఉండగా, ఆయన ఆమోదముద్ర వేయగానే వీరి నియామకం అధికారికంగా ఖరారు కానుంది.

# మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తాం

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే 'భూ లక్ష్మి పథకం' కింద భూమి లేని పేదలకు ఎకరం చొప్పున ఇస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలే కావచ్చు కానీ, పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి అంటే పంచప్రాణాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా పేదల అసైన్డ్ భూములనే లాక్కుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సోదరులు, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ, రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం దాదాపు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కుందని, ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్లుగా పేదల అసైన్డ్ భూములపై వారికే పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని సవాల్ విసిరారు.

రేవంత్ రెడ్డి 'మేకవన్నె పులి' లాంటి వారని... ఆయన చెప్పేది సామాజిక న్యాయం అయితే, చేసేది ఆటవిక న్యాయమని విమర్శించారు. కేబినెట్ తో పాటు ప్రభుత్వ సలహాదారులు, ఆర్టీఐ కమిషనర్ల నియామకాల వరకు బడుగు, బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరొక న్యాయం నడుస్తోందని మండిపడ్డారు.

# వందేమాతరం అలా పాడటం నేరమైతే.. గాంధీ, నెహ్రూపైనా కేసులు పెట్టండి

- మొదటి పేజి తరువాయి

నెహ్రూ పాడినదే తామూ పాడామని స్పష్టం చేశారు. అది నేరమైతే వారిపైనా కేసులు పెట్టాలని వ్యాఖ్యానించారు. ఆగస్టు 15న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం ఆలాపనపై వివాదం మొదలైంది. ఖర్గే జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తర్వాత వందేమాతరం ఆలపించారు. అయితే పార్టీ నిర్ణయం ప్రకారం తొలి రెండు చరణాలతో ముగించాల్సిన గేయాన్ని పూర్తిగా ఆలపించారు. గాయకులు కొనసాగించడాన్ని సోనియా గాంధీ గమనించి వారిని ఆపేందుకు ప్రయత్నించినట్లు ప్రచారం జరుగు తోంది. ఈ ఘటనపై సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు అందింది. వందేమాతరం ఆలాపనను అడ్డుకునేందుకు ప్రయత్నిం చారంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఫిర్యాదుదారు కోరారు. దీనిపై ఖర్గే స్పందిస్తూ.. గత 18 ఏళ్లుగా కాంగ్రెస్ పాడుతున్న వందేమాతరం గీతాన్నే తాజాగా కూడా ఆలపించామని చెప్పారు. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధా నిగా ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే గేయాన్ని ఆలపిం చిం దని గుర్తుచేశారు. వందేమాతరం విషయంలో కాంగ్రెస్ ఎప్పుడో తీర్మానం చేసిందని ఖర్గే తెలిపారు. భవిష్యత్తులో మరో ప్రభుత్వం వస్తే, వారు ఏ నిర్ణయం తీసుకుంటే అది అందరూ పాటించాలా? అని ప్రశ్నించారు.

# సీఎం విజయ్ కార్యాలయం మార్పుపై దుమారం.. టెండర్లలో అవినీతి జరిగిందంటూ ప్రతిపక్షాల మండిపాటు

- మొదటి పేజి తరువాయి

రూ. 5.5 కోట్ల టెండర్ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయంటూ బీజేపీ, డీఎంకేలు ధ్వజమెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై బీజేపీ నాయకుడు కేశవన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కొత్త ఆఫీస్ పనులు ఇప్పటికే ప్రారంభమైన నెల తర్వాత, ఎలాంటి ఆన్‌లైన్ విధానం అనుసరించకుండా రూ. 5.5 కోట్ల టెండర్‌ను విడుదల చేశారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం వచ్చి కేవలం 100 రోజులు కూడా కాకముందే పాలనలో పారదర్శకత లోపించిందని, నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు కేటాయించడంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మరోవైపు, డీఎంకే ఎమ్మెల్యే ఈవీ వేలు స్పందిస్తూ.. సీఎం తన కార్యాలయాన్ని మార్చుకోవడం ఆయన వ్యక్తిగత విషయమని, అయితే ప్రజాధనంతో ముడిపడి ఉన్న టెండర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న వార్తలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని కోరారు.

అయితే, ఈ అవినీతి ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. తమిళనాడు మంత్రి ఆధవ్ అర్జున మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రితో పనిచేస్తున్న అధికారులకు, సిబ్బందికి కేవలం 100 చదరపు అడుగుల స్థలం కూడా లేదని, వారికి మెరుగైన పని వాతావరణం కల్పించేందుకే ఈ తాత్కాలిక మార్పు చేపట్టామని వివరించారు. ఈ పనులకు సంబంధించి టెండర్లలో ఎలాంటి అక్రమాలు జరగలేదని ఆయన తేల్చిచెప్పారు.

# భోగాపురం వెళ్లాల్సిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

- మొదటి పేజి తరువాయి

కలకలం రేపింది. ఇక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురం వెళ్లాల్సిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో విమానాశ్రయ అధికా రులు అప్రమత్తమయ్యారు. విమానంలో బాంబు అమర్చినట్లు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందడంతో భద్రతా సిబ్బంది తక్షణమే రంగంలోకి దిగారు. ఈ బెదిరింపు నేపథ్యంలో, విమానాశ్రయ భద్రతా బాధ్యతలు పర్యవేక్షిస్తున్న సీఐఎస్ఎఫ్ బలగాలు వెంటనే తనిఖీలు ప్రారంభించాయి. ప్రయాణికులను సురక్షిత ప్రాంతానికి తరలించి, విమానాన్ని క్షుణ్ణంగా సోదా చేశారు. విమానాశ్రయ ప్రాంగణం లోనూ భద్రతను కట్టుదిట్టం చేసి, విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మరోవైపు, ఈ బాంబు బెదిరింపు ఈ-మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో నిఘా వర్గాలు దర్యాప్తును ముమ్మరం చేశాయి

# మోదీపై వ్యాఖ్యలకు గట్టిగా బదులివ్వాలి

- మొదటి పేజి తరువాయి

అవమానపరుస్తోందని నితిన్ నబిన్ విమర్శించారు. "పార్లమెంటులో ప్రతిపక్షాల తీరు, స్వాతంత్ర్య దినోత్సవం వేడుక ల సందర్భంగా కాంగ్రెస్ నాయకుల ప్రవర్తనను యావత్ దేశం గమనించింది. బీజేపీ కార్యకర్తలు ఎల్లప్పుడూ క్రమశిక్షణతో ఉంటారు, అయితే ప్రధానమంత్రి పట్ల ఉపయోగించిన పరుష పదజాలాన్ని ఏమాత్రం ఉపేక్షించకూడదు" అని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని 'పార్ట్-టైమ్ రాజకీయ నాయకుడు' అని ఎద్దేవా చేస్తూ, ఆయన కేవలం ప్రజల దృష్టిని మళ్లించే అంశాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 'వికసిత భారత్' ఆవిష్కారమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందని, దేశవ్యాప్తంగా రూ. 8 లక్షల కోట్లకు పైగా విలువైన మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. నేటి యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, స్టార్టప్‌ల ద్వారా ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగిందని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర పార్టీ ఇన్చార్జిలు, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

# శృంగధార గ్రామంలో వ్యక్తి హత్య....

**శంఖవరం పెన్ పవర్ ఆగష్టు 18:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో శంఖవరం మండలం శృంగధార గ్రామంలో వ్యక్తి హత్య
భార్యను వేదిస్తున్నాడనే కారణంతో రాజవొమ్మంగి మండలం వాతంగి పంచాయితీ ఓంపాలెం గ్రామానికి చెందిన మాణికుమార్ (32)ను కత్తితో నరికి హాత్య చేసిన కాకూరి చంద్రయ్య నిందితుడిని అదుపులోకి తీసుకున్న అన్నవరం పోలీసులు.



పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు మంత్రి సంధ్యారాణిని మర్యాదపూర్వకంగా

# కలిసిన ఎమ్మెల్యే సత్యప్రభ

### గిరిజన గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, ఆగస్టు, 16:**ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి తోపాటు నియోజకవర్గంలోని గిరిజన గ్రామాల అభివృద్ధికి సంబంధించిన సమస్యలను, ముఖ్యమంత్రి తోపాటు,మంత్రి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు.నియోజకవర్గ పరిధిలోని గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సత్యప్రభ వారిని కోరారు.గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులను సత్వరమే మంజూరు చేసి,అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.గిరిజన ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి,వారికి మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సత్యప్రభరాజా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును,మంత్రి సంధ్యారాణిని ఈ సందర్భంగా కోరారు.


# బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 జయంతి వేడుకలు



### గౌడ యువత బైకులతో భారీ ర్యాలీ







**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 18 :**బహుజన చక్రవర్తి, వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 376వ జయంతి వేడుకలు ఆత్రేయపురం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెర్లపాలెం గ్రామంలోని కాలువ గట్టుపై ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి గౌడ పెద్దలు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం మండల టీడీపీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌడ్ సంఘం డైరెక్టర్ మిద్దె ఆదినారాయణ , కొత్తపేట ఎంపీపీ మార్గాన్ని గంగాధర్ రావు, ఆత్రేయపురం టిడిపి ప్రధాన కార్యదర్శి గుడేల నాగేంద్ర గౌడ, రాష్ట్ర గౌడ్ సంఘ కార్యదర్శి వంక రామకృష్ణ , మార్గాను శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను వివరించారు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ చరిత్రలో ప్రముఖ బహుజన వీరుడిగా గుర్తింపు పొందారు. 17వ శతాబ్దం చివరి, 18వ శతాబ్దం ప్రారంభ కాలంలో జీవించిన ఆయన గౌడ కుటుంబంలో జన్మించి, సామాన్య ప్రజలపై జరుగుతున్న దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా పోరాటం సాగించారు.

పాపన్న గౌడ్ చిన్న వయస్సు నుంచే ధైర్యసాహసాలు ప్రదర్శించి, తన అనుచరులను సమీకరించి స్వతంత్ర పాలనకు పునాది వేశారు. అప్పటి రాజకీయ పరిస్థితుల్లో మొఘల్ పాలనకు, స్థానిక సామంతుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడుతూ అనేక ప్రాంతాలను తన ఆధీనంలోకి తీసుకున్నారు.

సర్వాయిపేటను కేంద్రంగా చేసుకుని తన పరిపాలనను విస్తరించిన పాపన్న, భువనగిరి, తాటికొండ, వరంగల్, కొలనుపాక తదితర ప్రాంతాల్లో తన ప్రభావాన్ని పెంచుకున్నట్లు చారిత్రక కథనాలు చెబుతున్నాయి. గోల్కొండ కోటపై కూడా తన ఆధిపత్యాన్ని సాధించిన వీరుడిగా పాపన్నకు చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంది.సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రజలను సమీకరించి వారికి నాయకత్వం వహించడం పాపన్న గౌడ్ పోరాటంలోని ముఖ్యమైన అంశంగా భావిస్తారు. అందుకే ఆయనను బహుజన వీరుడు సర్వాయి పాపన్న గా ప్రజలు గౌరవిస్తారు.పాపన్న గౌడ్ జీవితం ధైర్యం, స్వాభిమానం, సమానత్వం కోసం పోరాటానికి ప్రతీకగా నిలిచింది. ఆయన చరిత్రను భావితరాలకు అందించేందుకు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తూ ఇప్పుడైనా యువతకు ఆయన బాటలో నడవాలని యువతను,పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ఆయన జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని నాయకులు డిమాండ్ చేశారు. మహనీయుల చరిత్రను భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.జయంతి సందర్భంగా ఆత్రేయపురం మండలానికి చెందిన యువత పెద్ద సంఖ్యలో పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో ఉన్న పాపన్న గౌడ్ విగ్రహాలకు పాలాభిషేకాలు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ యువత తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంతో మెర్లపాలెం గ్రామంతో పాటు ఆత్రేయపురం మండలం లో పలు గ్రామాలు పండుగ వాతావరణం నెలకొంది. గౌడ సంఘాల నాయకులు, పెద్దలు, యువతతో పాటు పలువురు గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్‌కు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం గౌడ మట్ట సాయిగౌడ్ మట్టా వెంకన్న ,మట్ట శ్రీను, మట్ట శ్రీను అయినవిల్లి నాగేంద్ర , నాయకులు యువత పాల్గొన్నారు

# పారదర్శకమైన, తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలి

**-- జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పేనాయక్**

**కాకినాడ, పెన్ పవర్ ఆగస్టు 18:** జిల్లాలో గత జూలై 31న ప్రచురించిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై ప్రజలకు అవగాహన కల్పించి,అత్యంత ఖచ్చితత్వంతో కూడిన ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి.తిప్పేనాయక్ కోరారు.

మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి,జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతిని డీఆర్వో వివరించారు.ఈ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు తమ సహకారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా జూలై 31న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రచురించినట్లు తెలిపారు.జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు డ్రాఫ్ట్ జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు.కాకినాడ జిల్లాలో వివిధ కారణాలతో మొత్తం 1,95,602 ఓట్లను తొలగించినట్లు, వీటిలో 31,695 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పించి, క్లెయిమ్స్, అభ్యంతరాల నమోదుకు సహకరించాలని సూచించారు.కొత్త ఓటర్ల నమోదుకు ఫారం-6, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల కోసం ఫారం-7, పోలింగ్ కేంద్రం మార్పు కోసం ఫారం-8 ద్వారా అందిన దరఖాస్తులు, నోటీసులను నిబంధనల మేరకు అత్యంత పారదర్శకంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు.ఓటర్ల జాబితా సవరణలో నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ ఏఈఆర్‌ఓలు రోజుకు గరిష్టంగా 100 నోటీసులను మాత్రమే పరిశీలించాలని సూచించినట్లు డీఆర్వో తెలిపారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, అనర్హుల పేర్లు జాబితాలో లేకుండా అత్యంత పారదర్శకంగా, నిష్పక్ష పాతంగా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, ఎన్నికల యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని కోరారు.ఓటర్లకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 30వ తేదీలోగా సంబంధిత అధికారులకు దాఖలు చేయాలని సూచించారు. అర్హత కలిగి ఉండి నోటీసులు అందుకున్న ఓటర్లు గుర్తింపు పత్రాలతో సంబంధిత



అధికారుల ఎదుట హాజరై తమ అర్హతను ధ్రువీకరించుకోవచ్చని తెలిపారు.ఈ సమావేశంలో ఎన్. గౌతమ్ (ఆప్), ఎస్. అప్పారావు (బీఎస్పీ), పి. వీరబాబు (సీపీఐ-ఎం), కె. విజయ రామయ్య (భాజపా), పి. శ్రీనివాసరావు (ఐఎన్సీ), జి. సాయిబాబు (తెదేపా), ఆర్. వెంకటేశ్వరరావు (వైఎస్సార్ సీపీ), ఏ.వీవీ. సత్యనారాయణ (జేఎస్పీ), ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం. జగన్నాథం, డీటీ తేజ తదితరులు పాల్గొన్నారు.




# ఈవీఎం, వీవీపాట్స్ గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 18:** కాకినాడ కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎంలు, వీవీపాట్స్ గోదామును జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మంగళవారం రెవెన్యూ, పోలీస్, ఎన్నికల అధికారులతో కలిసి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గోదామును క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, ఈవీఎంలు,వీవీపాట్స్ భద్రతకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంలు, వీవీపాట్స్ భద్రత విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఈవీఎం గోదామును ప్రతి నెలా రెవెన్యూ, పోలీస్, ఎన్నికల అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి, అందుకు సంబంధించిన నివేదికను భారత ఎన్నికల సంఘానికి పంపుతున్నట్లు వెల్లడించారు.ఈ పరిశీలనలో జిల్లా రెవెన్యూ అధికారి డా. టి. తిప్పేనాయక్, కాకినాడ అర్బన్ తహశీల్దార్ వి. జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎం. జగన్నాథం, ఇతర ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

- ఈ నెల 31తేదీ వరకు పంటల బీమా పథకం పొడిగింపు.
- పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఏఓ నాగం సుధామాధురి.




**కిర్లంపూడి, పెన్ పవర్ ఆగస్టు, 18:**పంటల భీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి అన్నారు.మంగళవారం కిర్లంపూడి మండలం భూపాలపట్నం గ్రామంలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మండల వ్యవసాయ అధికారిణి సుధామాధురి మాట్లాడుతూ ' పంటల బీమా పథకం గడువు' ఈనెల 31 తేదీ వరకు పొడిగించడం జరిగిందన్నారు.కావున బ్యాంకులో 'రుణం పొందని రైతులు', 'కౌలు రైతులు' ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరి పంటకు ఎకరానికి రూ. 760/ రూపాయలు సి.ఎస్.సి సెంటర్ ద్వారా చెల్లించి ఈ పథకంలో చేరాలన్నారు.ఈ ఏడాది 'ఎల్ నినో 'ప్రభావం వల్ల వర్షాబావ పరిస్థితులు ఉన్నందున ప్రతి రైతు విధిగా పంటల బీమా నమోదు చేసుకోవాలని సూచించారు.అనంతరం పంట పొలాలను పరిశీలించి అధిక ఉష్ణోగ్రత వల్ల రసం పీల్చే పురుగులు ఉధృతి పెరిగే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎన్ .సీతారామమూర్తి , గ్రామ వ్యవసాయ సహాయకులు మాధురీలత పలువురు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## కోనసీమ కొబ్బరి రైతులకు అండగా ఆర్ డఆర్ పథకాన్ని విస్తృతంగా అమలు చేయాలి

-ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు 18:**డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కొబ్బరి తోటలలో తగ్గుతున్న ఉత్పాదకతపై పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ అసెంబ్లీలో ప్రస్తావించారు. కోనసీమ జిల్లాలో సుమారు 1.07 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతూ, రాష్ట్రంలోనే ప్రముఖ కొబ్బరి ఉత్పత్తి ప్రాంతంగా గుర్తింపు పొందింది. అయితే పాతబడిన తోటలు, రోగాలు--కీటకాల ప్రభావం, వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు, తోటల నిర్వహణ లోపాలు తదితర కారణాలతో కొబ్బరి దిగుబడులు తగ్గుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నేపథ్యంలో కొబ్బరి అభివృద్ధి బోర్డు అమలు చేస్తున్న రీప్లాంటింగ్ (ఆర్ ఒ ఆర్) పథకాన్ని కోనసీమ జిల్లాలో విస్తృత స్థాయిలో అమలు చేయాలని కోరారు. పాత, రోగగ్రస్త, తక్కువ దిగుబడి ఇచ్చే చెట్లను తొలగించేందుకు చెట్టుకు రూ. వెయ్యి రూపాయల వరకు, హెక్టారుకు గరిష్టంగా రూ. 32వేల వరకు సహాయం, తొలగించిన చెట్ల స్థానంలో నాణ్యమైన కొబ్బరి మొక్కలను నాటేందుకు మొక్కకు రూ45/- హెక్టారుకు గరిష్టంగా రూ. 4వేల 500 వరకు సబ్సిడీ అందించే విధానాన్ని రైతులకు విస్తృతంగా అందు బాటులోకి తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా ప్రస్తుత కొబ్బరి తోటల పునరుద్ధరణకు సమతుల్య ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, మట్టిసంరక్షణ, సేంద్రీయ ఎరువులు, కీటకాలు--వ్యాధుల సమగ్ర నియంత్రణ వంటి ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్ ను అమలు చేయాలని, ఇందుకోసం హెక్టారుకు రూ. 17వేల 500 వరకు ఆర్థిక సహాయం అందించే విధానాన్ని మరింత విస్తరించాలని ఎమ్మెల్యే కోరారు.

కోనసీమ కొబ్బరి రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆర్ ఒ ఆర్ పథకాన్ని ప్రత్యేక దృష్టితో అమలు చేస్తే పాత తోటలు పునరుజ్జీవనం పొంది, కొబ్బరి ఉత్పాదకత పెరగడంతో పాటు రైతుల ఆదాయం కూడా మెరుగుపడుతుందని గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. కొబ్బరి రైతులకు ప్రభుత్వం, కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా అవసరమైన సాంకేతిక సహాయం, ఆర్థిక ప్రోత్సాహకాలు అందించి, అర్హులైన ప్రతి రైతుకు పథకం ప్రయోజనాలు చేరేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు.

## జ్ఞాపకాల తీపి గుర్తులు కలకాలం గుర్తుండేందుకు ఫోటోగ్రఫీ ఎంతగానో దోహదం.










- కదిలే కాలానికి ఒక క్లిక్...
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,ఆగస్టు18:** బ్రిటన్ కు చెందిన బ్రిచ్లోజో సఫ్ టిసోఫర్ 1839 ఆగస్టు 19న ఫొటోగ్రఫీని ప్రపంచానికి పరిచయం చేశారు. దీంతో ఏటా అదే రోజున ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. భారతదేశంలో కూడా ప్రప్రథమంగా బ్రిటిష్ వారే ఫొటోగ్రఫీని పరిచయం చేశారు. కెమెరాలతో క్లిక్ మనిపించారు. జ్ఞాపకాల తీపి గుర్తులు కలకాలం ఉం దేందుకు ఫొటోగ్రఫీ ఎంతగానో దోహదపడుతుంది. మొదట్లో ధనవంతులకే అందుబాటులో ఉండేది. కాల క్రమేణ ఫొటోగ్రఫీలో విప్లవాత్మకమైన మార్పులు రాకతో పేదలకు సైతం ఫొటోలు అందుబాటులోకి వచ్చాయి. 160 ఏళ్ల క్రితం ఎన్నో ప్రయోగాలతో ఎంతో మంది కృషి ఫలితంగా ప్రవేశపెట్టిన ముసుగులు వేసి తీసే ఫీల్డ్ కెమెరాల నుంచి నేడు జేబులలో ఉండే సెల్ ఫోన్ కెమెరాల వరకు ఫొటోగ్రఫీలో ఎంతో మార్పు వచ్చింది. యూజ్ అండ్ డ్రోన్ కెమెరాలు, పిన్హాల్ కెమెరాలు ప్రస్తుతం లభ్యమవుతున్నాయి. తీసిన వెంటనే ఫొటో చేతికందే టెక్నాలజీ కూడా అందుబా టులోకి వచ్చింది. ప్రత్తిపాడులో సీనియర్ ఫొటోగ్రాఫర్ సలాది పెరుమాళ్లరావు 80 ఏళ్ల క్రితం స్టూడియోను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పెరుమాళ్లరావు తన యుడు కృష్ణ ఈ స్టూడియోను నిర్వహిస్తూ ఫొటోగ్రఫీ రంగంలో రాణిస్తున్నారు. ఆయన తీసిన పలు ఫొటోలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డుల ను, పురస్కారాలను అందుకున్నాయి.

-కొస మెరుపు..

ఆనాటి కాలం లో తన తండ్రి పెరుమాళ్ళరావు వాడిన పురాతన ముసుగు కెమెరా. పీల్డ్ కెమెరాల నుండి నేటి డిజిటల్
కెమెరాల వరకు నేటికీ ఈశ్వర్ స్టూడియో లో
భద్రం గా ఉంచడం విశేషం నేడు ప్రపంచ
ఫోటో గ్రఫీ దినోత్సవ సందర్భంగా ఈశ్వర్ స్టూడియో అధినేత కృష్ణతో ముచ్చటించడం జరిగింది..





## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థుల ప్రతిజ్ఞ



**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 18:**యువత డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కల్పించడంతో పాటు, మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో ఆత్రేయపురం మండలంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆత్రేయపురం మహాత్మ జూనియర్ కళాశాల, ఎంజీ హైస్కూల్‌లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై వాటి ప్రభావం, భవిష్యత్తుపై పడే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, తమ తోటి విద్యార్థులు సైతం మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. "ఈ తరం యువతతో నా దేశాన్ని మాదక ద్రవ్య రహిత దేశంగా మారుస్తాను" అనే సంకల్పంతో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సిబ్బంది కె. పద్మావతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్రేయపురం ఎస్ఐ, కళాశాల ప్రిన్సిపాల్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, మహిళా కానిస్టేబుల్, అంగన్‌వాడీ సిబ్బంది, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు. పి. నాగేశ్వరరావు, సీహెచ్. సునీల్ జోషి తదితరులు విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాలపై వివరించారు.

యువత దేశ భవిష్యత్తుకు కీలకమని, విద్యార్థి దశలోనే చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం ద్వారా డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి మరింతగా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.

## మాదకద్రవ్యాలకు నో చెప్పుదాం.. యువత భవిష్యత్తును కాపాడుదాం






**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు ,18:**గండేపల్లి మండలం సూరంపాలెం
ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో 3,500 మందితో జాతీయ ఇ-ప్రతిజ్ఞ
మంగళవారం మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ 6వ సంవత్సరం జాతీయ ఇ-ప్రతిజ్ఞ అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 3,500 మంది విద్యార్థులు, సిబ్బంది పాల్గొని మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ఇ-ప్రతిజ్ఞ చేశారు.

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జాతీయ ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి, యువతను వ్యసనాలకు దూరంగా ఉంచడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డా. పి. కృష్ణారావు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలకు బానిస కావడం వ్యక్తిగత జీవితానికే కాకుండా దేశ భవిష్యత్తుకు కూడా తీవ్ర నష్టం కలిగిస్తుందని అన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ కెరీర్‌పై, దేశ నిర్మాణంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. "మాదకద్రవ్యాలకు నో చెప్పుదాం.. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం" అని ఆయన సూచించారు.

## జనరేటివ్ ఏఐకు క్లౌడ్ పవర్.. ఆదిత్యలో ఒరాకిల్ శిక్షణ




**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు, 18:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలోని ఆదిత్య లెర్నింగ్ అకాడమీ మరియు కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో "ఒరాకిల్ క్లౌడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ : జెనెరేటివ్ ఏఐ సొల్యూషన్స్ ఆర్కిటెక్ట్ మరియు సర్వీసెస్" అనే ఆధునిక అంశంపై ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సును ప్రారంభించినట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులకు ఆధునిక క్లౌడ్ కంప్యూటింగ్ మరియు జనరేటివ్ ఏఐ సాంకేతిక తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ వి. వైతేశ్వరన్ రిసోర్స్ పర్సన్‌గా హాజరై ఒరాకిల్ క్లౌడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, జెనెరేటివ్ ఏఐ సొల్యూషన్స్ మరియు సర్వీసెస్ సంబంధించిన అంశాలపై విలువైన అవగాహన కల్పించారు. క్లౌడ్ ఆధారిత సాంకేతికతలు, జనరేటివ్ ఏఐ పరిష్కారాల రూపకల్పన, వాటి సేవలు మరియు ఆధునిక సాంకేతిక రంగంలో వాటి ప్రాధాన్యత ను వివరించారు.జనరేటివ్ ఏఐ ఆధారిత పరిష్కారాలను క్లౌడ్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా అభివృద్ధి చేయడంలో అవసరమైన సాంకేతిక అంశాలపై రిసోర్స్ పర్సన్ వివరించారు. అలాగే మారుతున్న పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు క్లౌడ్ కంప్యూటింగ్, జనరేటివ్ ఏఐ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.ఈ కార్యక్రమానికి ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ ఐ వీరాంజనేయులు, అల్లం బాలాజీ వంశీ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం బి శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డాక్టర్ ఎస్ రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ (ఇంజనీరింగ్, సైన్సెస్) డాక్టర్ ఎ రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి సురేష్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం వి రాజేష్ మరియు కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం హెడ్ డాక్టర్ ఎస్ రమేష్ పాల్గొన్నారు.

## భవిష్యత్ సైబర్ సెక్యూరిటీకి ఏఐ కీలకం.. ఆదిత్యలో విజ్ఞానదాయక గెస్ట్ లెక్చర్





**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 18:**గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో, సీఎస్ఐ స్టూడెంట్ చాప్టర్ సహకారంతో "ఏఐ సైబర్ సెక్యూరిటీ రెవల్యూషన్ " అనే అంశంపై గెస్ట్ లెక్చర్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మిస్టర్ రామకృష్ణ చైతన్య ఎమని, ఇన్ఫర్మేషన్ ప్రొటెక్షన్ మేనేజర్, ఎవెర్నార్త్ హెల్త్ సర్వీసెస్, హైదరాబాద్ రిసోర్స్ పర్సన్‌గా హాజరై విద్యార్థులకు కృత్రిమ మేధస్సు మరియు సైబర్ భద్రతకు సంబంధించిన అంశాలపై విలువైన అవగాహన కల్పించారు. ఆధునిక సైబర్ భద్రతలో కృత్రిమ మేధస్సు పాత్ర, పెరుగుతున్న సైబర్ ముప్పులు, సంస్థల సమాచార భద్రతకు ఎదురవుతున్న సవాళ్లపై విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమం విద్యార్థులకు ఏఐ మరియు సైబర్ భద్రత రంగాల్లో పరిశ్రమ నిపుణుల నుంచి ప్రత్యక్ష అవగాహనను అందించింది. కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆధునిక సైబర్ భద్రతా సాంకేతికతలపై ఆసక్తి పెరగడంతో పాటు, భవిష్యత్‌లో ఏఐ మరియు సైబర్ భద్రత రంగాల్లో అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి ప్రేరణ లభించింది. ఈ కార్యక్రమం విద్యార్థులకు విజ్ఞానదాయకంగా, ఉపయోగకరంగా విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమానికి ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ గ డాక్టర్ ఐ వీరాంజనేయులు వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డాక్టర్ ఎస్ రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ (ఇంజనీరింగ్, సైన్సెస్) డాక్టర్ ఎ రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి సురేష్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం వి రాజేష్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం హెడ్ డాక్టర్ మాకినీడి రాజాబాబు, డిప్యూటీ హెడ్స్ డాక్టర్ ఎ. లక్ష్మణరావు, ఎస్. నీలిమ మరియు విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

# పంట కాలువలో ఈతకు నో.. అతిక్రమిస్తే కఠిన చర్యలు!

**మురారి శివారులో ప్రమాదకర పంట కాలువ.. యువతకు పోలీసుల హెచ్చరిక**




**గండేపల్లి, పెన్ పవర్ ,ఆగస్టు 18**: గండేపల్లి మండలం మురారి గ్రామ శివారులోని పంట కాలువలో ఈత కొట్టడంపై అధికారులు నిషేధం విధించారు. కాలువలో కొందరు యువకులు ఈత కొడుతున్న దృశ్యాలను యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడంతో ఈ విషయం అధికారుల దృష్టికి వచ్చింది.

ఈ పంట కాలువ లోతుగా, అత్యంత ప్రమాదకరంగా ఉన్నందున ఈత రాని వారు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో వీడియోలు చూసి యువకులు, చిన్నారులు అక్కడికి వెళ్లి ఈత కొట్టే ప్రయత్నం చేయవద్దని సూచించారు.

ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సదరు పంట కాలువలో ఈత కొట్టడాన్ని అధికారులు పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ఎవరూ కాలువలోకి దిగరాదని, నిషేధాన్ని ఉల్లంఘించి కాలువలోకి దిగినా లేదా ఈత కొట్టినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

**సోషల్ మీడియా వీడియోలతో ప్రమాదాలకు ఆహ్వానం పలకవద్దు**

వినోదం కోసం ప్రమాదకర ప్రాంతాల్లో ఈత కొడుతూ వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడం వల్ల ఇతరులు కూడా అదే ప్రదేశానికి వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. యువత బాధ్యతగా వ్యవహరించి ప్రమాదకరమైన పంట కాలువలకు దూరంగా ఉండాలని సూచించారు.



# ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు

**జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలి**
**- నీటి వనరుల సక్రమ వినియోగానికి గ్రామస్థాయిలో వాటర్ సెక్యూరిటీ ప్లాన్‌లు రూపొందించాలి**
**-- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**





**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 18:** ప్రతి ఇంటికి స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో జిల్లాలో చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య మిషన్ (డీడబ్ల్యూఎస్ఎం)పై సమీక్ష సమావేశం నిర్వహించారు. జల్ జీవన్ మిషన్ అమలు పురోగతిపై పంచాయతీ,ఇరిగేషన్, వ్యవసాయం, డ్వామా,గ్రౌండ్ వాటర్,ఐసీడీఎస్, డీఆర్డీఏ తదితర శాఖల అధికారులతో సమగ్రంగా సమీక్షించారు.జల్ జీవన్ మిషన్ పనులు,ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం,నీటి వనరుల పరిరక్షణ, భూగర్భ జలాల అభివృద్ధి,తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్,పారిశుధ్య పనులపై తీసుకోవాల్సిన చర్యలను కలెక్టర్ అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సూచించారు.జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి గ్రామానికి శుద్ధమైన తాగునీటిని అందించి,2028 నాటికి జిల్లాలోని ప్రతి గ్రామాన్ని 'హర్ ఘర్ జల్' గ్రామంగా ప్రకటించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లాలోని 389 గ్రామాల్లో 75 గ్రామాలను హర్ ఘర్ జల్ గ్రామాలుగా గుర్తించగా,ఇప్పటి వరకు 61 గ్రామాలను హర్ ఘర్ జల్ గ్రామాలుగా ప్రకటించినట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో పనులను వేగవంతం చేసి సురక్షిత తాగునీటి సరఫరా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.జిల్లాలో మొత్తం 3,79,185 గృహాలకు గాను ఇప్పటివరకు 2,96,777 గృహాలకు తాగునీరు అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిన గృహాలకు కూడా ప్రణాళికా బద్ధంగా నిర్దేశిత గడువులోగా తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. తాగునీటి సరఫరా నాణ్యతను కాపాడుతూ, దీర్ఘకాలికంగా సుస్థిర సేవలు అందించడం ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు.జల్ జీవన్ మిషన్ కింద 1,007 పనులకు గాను ఇప్పటివరకు 596 పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులను నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.తాగునీటి వనరులను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి క్లోరినేషన్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.గ్రామాల్లో డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి సారించాలని,ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.జిల్లాలోని 22 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను 100 శాతం నీటితో నింపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.నిర్మాణం పూర్తయిన 120 ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో నీరు,పారిశుధ్య కమిటీలను పునరుద్ధరించి,పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు.నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రతి గ్రామంలో వాటర్ సెక్యూరిటీ ప్లాన్‌లను ఆగస్టు 31వ తేదీలోగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.స్వచ్ఛ భారత్ మిషన్ కింద జిల్లాలో చేపట్టిన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనులను కూడా సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో 190 శానిటరీ కాంప్లెక్స్‌లు మంజూరు కాగా, ఇప్పటివరకు 188 పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు.అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీరు,మరుగుదొడ్ల సదుపాయాలకు సంబంధించి 28 పనులు మంజూరు కాగా,ఇప్పటివరకు 24 కేంద్రాల్లో పనులు పూర్తయ్యాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు క్షేత్రస్థాయిలో గ్రామీణ నీటి సరఫరా అధికారులు చురుకుగా భాగస్వామ్యం కావాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం.డి.మతిన్,జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు,డీపీఓ వి.రవికుమార్, డ్వామా పీడీ ఎన్.మధుసూదన్,గ్రౌండ్ వాటర్ డీడీ రాధాకృష్ణ,డీఆర్డీఏ, ఐసీడీఎస్ పీడీలు జి.శ్రీనివాసు,సీహెచ్. లక్ష్మి,డీఎంహెచ్ఓ డా.కె.అనిత, డీటీడబ్ల్యూఓ,ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు, ఏఈలు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మాటలు ఎన్నో.. నీళ్లు ఎక్కడ?

**ఆగస్టు 15న సాగునీరు ఇస్తామన్న హామీ ఏమైంది? తాళ్లూరు పుష్కర ఎత్తిపోతలపై రైతుల తరుపున సూర్యచంద్ర ఆవేదన**



**జగ్గంపేట:** గండేపల్లి మండలం తాళ్లూరు పుష్కర ఎత్తిపోతల పథకం పునరుద్ధరణతో సాగునీటి కష్టాలు తీరుతాయని ఆశించిన రైతులకు నిరాశే ఎదురవుతోందని జగ్గంపేట ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాఠం శెట్టి సూర్యచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పుష్కర పంప్ హౌస్ వద్ద నిర్వహిస్తున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పడుతున్న పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో రైతుల సమస్యలపై పోరాటాలు చేశారని , అధికారంలోకి వచ్చిన వెంటనే పుష్కర పథకాన్ని పునరుద్ధరించి సాగునీరు అందిస్తామని హామీలు ఇచ్చారని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం తాళ్లూరు పుష్కర ఎత్తిపోతల పథకానికి రూ.52 కోట్ల పరిపాలనా అనుమతి లభించిందని, 2025 డిసెంబర్‌లో ఒప్పంద ప్రక్రియ పూర్తయిందని సూర్య చంద్ర తెలిపారు . 2026 ఫిబ్రవరి 6 నుంచి పనులు ప్రారంభించాల్సి ఉండగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తో శంకుస్థాపన అనుమతుల కోసం ఆయన చుట్టూ తిరిగి కాలయాపన చేశారన్నారు. ఇరిగేషన్ పనులు శంకుస్థాపనలు నిర్వహించడానికి ఇరిగేషన్ మంత్రితో చెయ్యాలే తప్ప విద్యాశాఖ మంత్రితో కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలయాపనతో వేసవికాలంలో జరగవలసిన పనులు వర్షాకాలంలో నిర్వహించడం బాధాకరమన్నారు. పాత పైపులైన్లను తొలగించి కొత్త ఎంఎస్ పైపులైన్ ఏర్పాటు చేయడంతో పాటు మోటార్ల మరమ్మతులు చేపట్టడం ఆలస్యం అవుతుందని "ఆగస్టు 15న నీళ్లు ఇస్తాం".. అని చెప్పి నెరవేరని హామీ రైతులకు చెప్పడంతో నమ్మి రైతుల వ్యవసాయ సాగు ప్రారంభించారన్నారు. పనులు పూర్తయిన వెంటనే సాగునీరు అందిస్తామని హామీలు వరుసగా వస్తున్నప్పటికీ, గడువులు మాత్రం మారుతున్నాయని సూర్యచంద్ర ఆవేదన వ్యక్తం వ్యక్తం. జూన్ 20న నీరు అందిస్తామని చెప్పారని, ఆ గడువు దాటిన తర్వాత ఆగస్టు 15 నాటికి తప్పనిసరిగా నీరు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

జూలై 20న పంప్‌హౌస్ వద్ద రైతులతో మాట్లాడిన స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆగస్టు 15న నీరు అందిస్తామని హామీ ఇవ్వడంతో, జగ్గంపేట నియోజకవర్గంలోని పుష్కర ఆయకట్టు రైతులు 32 వేల ఎకరాల అయకట్టు రైతులు ఆ తేదీ కోసం ఎదురుచూశారని పేర్కొన్నారు. అయితే ఆగస్టు 15 గడిచిపోయినా సాగునీరు అందకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

గడువులు మారుతున్నాయే తప్ప.. నీరు రావడం లేదు!

నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసి రైతులకు నీరు అందించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగం, సంబంధిత ప్రజాప్రతినిధులపై ఉందని సూర్యచంద్ర తెలిపారు . ఇప్పటికే పంటల సాగు సమయం దాటిపోతుండటంతో మరింత ఆలస్యం జరిగితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

"హామీలు కాదు.. పొలాలకు నీళ్లు కావాలి" అని స్పష్టం చేస్తున్నారు.

పుష్కర ఆయకట్టు 32 వేల ఎకరాల కు పట్ట నష్టపరిహారంగా ఎకరాకు 20000 చొప్పున ఇచ్చే విధంగా అసెంబ్లీలో స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గలంపాలని కోరారు. లేనియెడల రైతులు చాలా ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొందని అప్పులు ఊపులో పడి ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు అది సంఖ్యలో నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## జగ్గంపేట డొక్కా సీతమ్మ క్యాంటీన్ లో అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగష్టు 18 :** జగ్గంపేట పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి ఉచితంగా భోజనం అందించారు. జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సేవా స్ఫూర్తితో ప్రతి మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తుమ్మలపల్లి రమేష్ తెలిపారు. పేదలు, కూలీలు, వృద్ధులు, ఆపదలో ఉన్న వారికి భోజనం అందించడం ద్వారా వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు. అన్నదాన కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు తుమ్మలపల్లి రమేష్ స్వయంగా భోజనం వడ్డించారు. భోజనం చేస్తున్న వారితో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, వీరమహిళలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి తెలుగుదేశం



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగస్టు 18:** మాచవరం, అంబాజీపేట111 ,116 ,లో డోర్ టు డోర్ కార్యక్రమం గణపతి వీర రాఘవులు క్లస్టర్ పరిధిలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో
రాష్ట్ర శెట్టిబజ్జీ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, టిడిపి సీనియర్ నాయకులు నాగాబత్తుల వెంకటసుబ్బారావు లు కూటమి ప్రభుత్వం ప్రభుత్వం రెండు సంవత్సరాల చేసిన అభివృద్ధి సంక్షేమాల వివరించడంతో పాటు వారి యొక్క సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా చేయుటంతో పాటు సూపర్ సిక్స్ అమలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రవణం రాము, నాయకులు దొమ్మేటి రామారావు, తెలుగు యువత అధ్యక్షులు జోగి కృష్ణ చైతన్య, గుత్తుల చంటి, గుత్తుల సురేష్ కుమార్ కొప్పినీడి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం.. సంఘ బలోపేతానికి పిలుపు

**ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సమావేశం**



**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 18:** ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సమావేశం గండేపల్లి మండలం జెడ్ రాగంపేట పంచాయతీ పరిధిలో గల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో మీటింగ్ హాల్‌లో నిర్వహించారు. జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి ప్రాంతాలకు చెందిన సంఘ సభ్యులు సమావేశానికి హాజరై సభ్యత్వ నమోదు, సంఘ బలోపేతం, ఉద్యోగుల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా కాకినాడ జిల్లా అధ్యక్షుడు మల్లాది జగన్నాథం, కార్యదర్శి జ్యోతుల రాంబాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ డీఏ రతన్ రాజ్, వైస్ ప్రెసిడెంట్ బాను ప్రకాష్ పాల్గొన్నారు. జగ్గంపేట తాలూకా యూనిట్ పరిధిలోని ఉద్యోగుల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంఘం తరపున కృషి చేయాలని సూచించారు. అలాగే ఉద్యోగులందరినీ సంఘంలో భాగస్వాములను చేసి సభ్యత్వాన్ని పెంచాలని దిశానిర్దేశం చేశారు.

సమస్యల పరిష్కారానికి సమష్టి పోరాటం

ఉద్యోగుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి సంఘ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొని ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

జగ్గంపేట యూనిట్ అధ్యక్షుడు కే. ఫణీంద్ర కుమార్, కార్యదర్శి కే. ప్రసాద్, జఎజ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రణీత్తో పాటు పలువురు ఉద్యోగులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# రౌతులపుడి తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జేసీ

- ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి
- భూ సమస్యల అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
- జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్





**రౌతులపుడి/కాకినాడ పెన్ పవర్,ఆగస్టు 18:** కాకినాడ జిల్లా పరిధిలోని రౌతులపుడి మండల తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయంలోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యాలయ రికార్డు రూమ్, సిబ్బంది హాజరు పట్టికలను తనిఖీ చేసి సంబంధిత వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందిన అర్జీల పరిష్కార పురోగతిని పరిశీలించి, వాటి స్థితిగతులపై అధికారులను ఆరా తీశారు.అనంతరం మండలంలోని ఆయా గ్రామాల వీఆర్వోలు, సర్వేయర్లతో జేసీ సమావేశం నిర్వహించారు. మీ సేవ డ్యాష్‌బోర్డులోని వివరాల ఆధారంగా రీ సర్వే, పట్టాదారు పాస్ పుస్తకాలు, 22ఏ, మ్యుటేషన్ తదితర భూ సమస్యలపై అందిన దరఖాస్తులు, వాటిపై తీసుకున్న చర్యలను సమీక్షించారు.ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలు ప్రజలకు సకాలంలో అందేలా రెవెన్యూ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ సుపరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలని,ఇందుకోసం అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.ప్రధానంగా పీజీఆర్ఎస్, 22ఏ, రీ సర్వేలకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ అంశాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, భూ పరిపాలన ముఖ్య కమిషనర్ స్థాయిలో ప్రతివారం సమీక్షలు జరుగుతున్నందున,ఆయా అంశాల్లో ఆశించిన స్థాయిలో పురోగతి సాధించాలని సూచించారు.అనంతరం కార్యాలయ పరిసరాలను,రికార్డు రూమ్‌లను పరిశీలించిన జేసీ కార్యాలయ ప్రాంగణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా కార్యాలయాన్ని నిర్వహించాలని అధికారులకు,సిబ్బందికి సూచించారు.

అనంతరం రౌతులపుడి గ్రామంలో రైతు కాకర్ల స్వామి నాయుడు పొలంలో నిర్వహిస్తున్న రీ సర్వే పనులను జేసీ అపూర్వ భరత్ పరిశీలించారు.రోవర్ ద్వారా పొలం సరిహద్దులను స్వయంగా పరిశీలించి,భూ యజమానితో మాట్లాడి రీ సర్వేకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ తనిఖీలో జేసీ వెంట తహశీల్దార్ కృష్ణకుమారి, డిప్యూటీ తహశీల్దార్,రీ సర్వే తహశీల్దార్లు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధం కావాలి





జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 18:** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని విధాలా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు.స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పరిషత్, పంచాయతీ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారులు సమాయత్తం కావాలని సూచించారు. పంచాయతీ ఎన్నికలతో పాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను చేపట్టాలని ఆదేశించారు.

జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల వివరాలను ఆగస్టు 18 నుంచి 22వ తేదీ వరకు ఇంటింటా తనిఖీ చేసి, తుది జాబితాను సెప్టెంబర్ 7వ తేదీన ప్రచురించాలని అధికారులకు సూచించారు.ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆగస్టు 31వ తేదీ నాటికి పోలింగ్ కేంద్రాల జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీ ఎన్నికలతో పాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను కూడా పరిశీలించాలని సూచించారు. ఆగస్టు 22వ తేదీ నాటికి ఎంపీటీసీ, జెడ్పీటీసీ జాబితాలను ప్రచురించాలని తెలిపారు.మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని తుని, పెద్దాపురం,సామర్లకోట,గొల్లప్రోలు, ఏలేశ్వరం మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా సెప్టెంబర్ 3వ తేదీన డ్రాఫ్ట్ ఓటరు జాబితాను ప్రచురించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన గెజిట్ నోటిఫికేషన్‌ను వారంలోగా విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ప్రక్రియలను సజావుగా పూర్తి చేసేందుకు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు,డీపీఓ వి. రవికుమార్,పెద్దాపురం,సామర్లకోట, గొల్లప్రోలు,ఏలేశ్వరం మున్సిపల్ కమిషనర్లు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఈ-క్రాప్ బుకింగ్, పంటల బీమా ప్రక్రియను వేగవంతం చేయాలి



- ఎల్‌నినో ప్రభావంతో వరి సాగు కాని భూముల్లో ప్రత్యామ్నాయ పంటలు చేపట్టాలి
- రసాయన ఎరువుల వినియోగంలో సమతుల్యత పాటించాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 18:** కాకినాడ జిల్లాలో సాగు చేపట్టిన ప్రతి రైతుకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ఈ-క్రాప్ బుకింగ్, పంటల బీమా వర్తింపు ప్రక్రియలను వేగవంతం చేసి రైతులకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మంగళ వారం కలెక్టరేట్ నుంచి వివిధ మండలాల వ్యవసాయ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సాగునీటి సరఫరా,పంటల బీమా, ఈ-క్రాప్ బుకింగ్,ఎరువుల పంపిణీ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఏలేరు జలాశయం ఆయకట్టు కింద సాగునీటిని వంతుల వారీగా రొటేషన్ పద్ధతిలో చివరి ఆయకట్టు వరకు సమృద్ధిగా అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,33,000 ఎకరాల ఆయకట్టులో ఇప్పటివరకు 1,61,000 ఎకరాల్లో, అంటే 69 శాతం మేర వరి సాగు పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. ఈ-క్రాప్ బుకింగ్ నమోదు ప్రక్రియ 50 శాతం పూర్తయినందున,మిగిలిన భూముల్లో నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మిగిలిన భూముల్లో ఏయే పంటలు సాగు చేసేందుకు అవకాశాలు ఉన్నాయో గుర్తించి, ఆ మేరకు రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు.మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద సాగు వివరాలను రైతు సేవా కేంద్రాల వారీగా సమర్పించాలని సూచించారు.నీటి కొరత కారణంగా వరి సాగు సాధ్యం కాని భూముల్లో పప్పుధాన్యాలు, పీఎండీఎస్ అంతర పంటలు లేదా పశుగ్రాసం సాగు చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.భూసారాన్ని కాపాడుకునేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకే రసాయన ఎరువులను వినియోగించాలని సూచించారు. కొన్ని మండలాల్లో యూరియా 120 శాతం, డీఏపీ 150 శాతం అధికంగా వినియోగిస్తున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్న నేపథ్యంలో రసాయన ఎరువుల వినియోగంలో సమతుల్యత పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.నిర్దేశిత యాప్ ద్వారా యూరియా, డీఏపీ వంటి ఎరువులను సమపాళ్లలో పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) కె.రాబర్ట్ పాల్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, సంబంధిత మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 14 నుంచి 22 వరకు గణపతి నవరాత్రులు





- వినాయక చవితి సందర్భంగా విగ్రహాల నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు
- జిల్లా యంత్రాంగానికి ఉత్సవ కమిటీ నిర్వాహకులు సహకరించాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 18:** వినాయక చవితి పండుగ సందర్భంగా గణేశ విగ్రహాల నిమజ్జనానికి జిల్లాలో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గణపతి నవరాత్రులు, విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులను పూజించాలని సూచించారు.విగ్రహాల తయారీలో రసాయన రంగులకు బదులుగా సాధ్యమైనంత వరకు సహజ రంగులను ఉపయోగించేలా అవగాహన కల్పించాలని తెలిపారు.పర్యావరణానికి హాని కలగకుండా,శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించేందుకు జిల్లా స్థాయి సమావేశంతో పాటు డివిజన్,మండల స్థాయిలోనూ ఉత్సవ కమిటీలతో సమావేశాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.బహిరంగ ప్రదేశాలు,రహదారులపై గణేశ మండపాలు ఏర్పాటు చేసేటప్పుడు సంబంధిత రెవెన్యూ,పోలీస్,స్థానిక సంస్థలు,విద్యుత్,అగ్నిమాపక శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని తెలిపారు.నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద ఇసుక,నీరు,అగ్నిమాపక పరికరాలు వంటి అగ్ని ప్రమాద నివారణ సామగ్రిని అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు.ఉత్సవాల సందర్భంగా బాణసంచా కాల్చరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిమజ్జన సమయంలో పూజా సామగ్రి, ఇతర వస్తువులను కాల్చడం వల్ల వాయు కాలుష్యం ఏర్పడే అవకాశం ఉన్నందున అటువంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.నిమజ్జనం రోజుల్లో విగ్రహాల ఊరేగింపులకు సంబంధిత పోలీస్ శాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఊరేగింపు వెళ్లే మార్గాలను ముందుగానే పోలీస్ శాఖకు తెలియజేయాలని,నిమజ్జనం కోసం నిర్దేశించిన ప్రదేశాల్లోనే కార్యక్రమాన్ని నిర్వహించేలా నిర్వాహకులు సహకరించాలని కోరారు.ఒకేసారి ఎక్కువ సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనానికి రాకుండా స్లాట్ పద్ధతిలో నిమజ్జనం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రెవెన్యూ, మున్సిపల్,పంచాయతీ,అగ్నిమాపక, పోలీస్ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి,గ్రామీణ ప్రాంతాలతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గణేశ విగ్రహాల నిమజ్జనానికి అనువైన ప్రదేశాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు.రెండు రోజుల్లోగా నిర్దిష్ట సిఫార్సులతో కూడిన నిమజ్జన ప్రదేశాల జాబితాను సమర్పించాలని సూచించారు.గణేశ మండపాల వద్ద రాత్రి 10 గంటల తర్వాత మైక్ సెట్ల వినియోగాన్ని నిలిపివేయాలని ఆదేశించారు. పంచాయతీ పరిధిలో డీపీఓ, గ్రామస్థాయిలో పంచాయతీ అధికారులు,పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు నిమజ్జన ప్రదేశాల్లో క్రేన్లను ఏర్పాటు చేయాలని సూచించారు.నిమజ్జన ప్రదేశాల్లో తగినంత విద్యుత్ దీపాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని, మత్స్యశాఖ ఆధ్వర్యంలో పడవలు, ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. అన్ని నిమజ్జన ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు.నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని,ప్రతిరోజూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పారిశుధ్య సిబ్బందిని షిఫ్టుల వారీగా నియమించి సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.

జిల్లాలో గణపతి నవరాత్రులు,గణేశ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను శాంతియుత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఉత్సవ కమిటీ నిర్వాహకులు కూడా జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు గతంలో నిమజ్జన సమయంలో ఎదురైన సమస్యలు,వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సమావేశంలో డీఆర్వో డా.తిప్పేనాయక్, సంబంధిత శాఖల అధికారులు,ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

# గడపగడపకూ పలకరింపు.. సమస్యలపై ఆరా

1వ డివిజన్‌లో ‘ఇంటింటికి తెలుగుదేశం’

ప్రజలతో మమేకమైన పిల్లి దంపతులు

**కాకినాడ రూరల్ పెన్ పవర్, ఆగస్టు 18:** ప్రజలతో ఆత్మీయ పలకరింపులు.. స్థానిక సమస్యలపై ప్రత్యక్ష పరిశీలన.. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తుచేసుకుంటూ ప్రస్తుత అవసరాలపై చర్చ.. ఇలా ప్రజలతో మమేకమవుతూ 1వ డివిజన్‌లో ‘ఇంటింటికి తెలుగుదేశం’ కార్యక్రమం మంగళవారం కొనసాగింది.

టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, ఆమె భర్త పిల్లి సత్యనారాయణమూర్తి డివిజన్‌లో పర్యటించి నేరుగా ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లారు. ప్రతి కుటుంబంతో మాట్లాడి వారి సమస్యలను, స్థానిక అవసరాలను తెలుసుకున్నారు.

మహిళలు, వృద్ధులు, యువత, కార్మికులు, స్థానిక నివాసులతో మాట్లాడిన పిల్లి దంపతులు రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర సమస్యలపై ఆరా తీశారు. ప్రజలు తెలిపిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

### గత అభివృద్ధిని గుర్తుచేసుకున్న స్థానికులు

పిల్లి అనంతలక్ష్మి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులను పలువురు స్థానికులు గుర్తుచేసుకున్నారు. రహదారులు, ప్రభుత్వ భవనాలు, మౌలిక వసతుల కల్పన తదితర పనులు తమ ప్రాంతానికి ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు.అయితే కాలక్రమేణా పెరిగిన జనాభా, మారిన అవసరాలకు అనుగుణంగా మరిన్ని సౌకర్యాలు అవసరమని స్థానికులు పేర్కొన్నారు. గత అభివృద్ధిని గుర్తుచేసుకుంటూనే ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను కూడా పిల్లి దంపతుల దృష్టికి తీసుకువచ్చారు.

డివిజన్‌లో పర్యటించిన పిల్లి దంపతులను పలువురు స్థానికులు ఆప్యాయంగా పలకరించారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తమ ప్రాంతానికి వచ్చిన సందర్భాలను గుర్తుచేసుకున్నారు. కొందరు వృద్ధులు పాత పరిచయాలను గుర్తుచేసుకుంటూ పిల్లి అనంతలక్ష్మితో ఆత్మీయంగా మాట్లాడారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఈ సందర్భంగా పిల్లి అనంతలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజలతో సంబంధం ఎన్నికలతో మొదలై, ఎన్నికలతో ముగిసేది కాదని అన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా చెప్పుకునే అవకాశం కల్పించడమే ‘ఇంటింటికి తెలుగుదేశం’ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు.పిల్లి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు చేపట్టిన తర్వాత వాటి ఫలాలు ప్రజలకు అందుతున్నాయా లేదా తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యమన్నారు. ప్రజలు సూచించిన అంశాలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు ప్రోత్సాహం, సామాజిక భద్రతా పథకాలు తదితర కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అర్హులైన కుటుంబాలు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందేలా అవసరమైన సమాచారాన్ని అందించారు.ప్రజల నుంచి వచ్చిన సూచనలు, సమస్యలను నమోదు చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పిల్లి దంపతులు తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ పెరబత్తుల లోవబాబు, వై.వి. దాసు, కర్రి వెంకటరాజు, ములసా బాబురావు, టీడీపీ నాయకులు, క్లస్టర్ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు,డివిజన్ కమిటీ నాయకులు, కూటమి శ్రేణులు, మహిళలు,యువత,స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# మేము కోరుకున్నచోట పునరావాసం కల్పించండి. -వడ్డిగూడెంయువకులు గ్రామస్థులుమహిళలు

-జలసమాధిమాకు దిక్కుఅంటున్నగ్రామస్థులు

**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.18** పోలవరంప్రజెక్టుకారణంగా సర్వంకోల్పోతు న్నవడ్డిగూడెం గ్రామస్థులు, శివాలయంవద్దమంగళవారం సమావేశంఏర్పాటు చేసుకోవడంజరిగింది. ఈసమావేశంలోగ్రామస్థులు మాట్లాడు తూకొత్తపల్లిలో పునరావాసంగృహాలస్థ లాలు మాకువద్దు, వడ్డిగూడెంగ్రా మస్థులందరూఒకేచోట ఉండేవిదంగా ఇంటిస్థలాలుఇవ్వాలని, పేర్కొన్నారు .కొత్తప ల్లివె ళ్లడంతమజీవి తాలనుఅతోగతిపా లుచేస్తుందని, మాబంధువర్గాలుచుట్టుక్కలగ్రా మప్రజలుమాకు తెలిసిన, మాకుటుంబాల తోపరిచయాలుఅనుబంధాలు బంధాలతోఉ న్ననిర్వాసి తులంద రూతాడువాయి, కొయ్యలగూడెం, పరిసరప్రాంతాల్లోగృహా లకేటాయిం పులు చేయగామమ్మల్నికొత్తపల్లిపంపించి మమ్మల్నిఒంటరివారిని, చేయవద్దని కొత్తపల్లివెళ్లడంతమకుఇష్టం లేదని,పోలవరంప్రాజెక్టునీటిలోజలసమాధి అవుతామని,కొత్తపల్లిమాత్రంవెళ్లమని ,వడ్డిగూడెంగ్రామస్తులు ముక్తకంఠంతో ఆరోపించారు.గతంలో కొందరు తెలి సితెలియకచే సినపొరపాటుకు, మొత్తం గ్రామాన్నిబలి పెట్టవద్దని, మాయందుదయవుంచి మమ్మల్ని మేము కోరుకున్న చోటపునరావాసం కల్పించాలని,లేనిపక్షంలో తాము ఇక్కడే జలసమాధిఅవుతా మని,ఆవేదనవ్యక్తం చేశారు. ఆర్.అండ్.ఆర్ ఇళ్లపరిహారం,పూర్తిస్థాయిలో గ్రామస్తులుఅందరికీఅందినతర్వాతేమమ్మల్నిఇక్కడి నుంచి తరలించాలని,అక్కడికి వెళ్ళినతర్వాత ఇస్తాం మీరు వెళ్లిపోండి.అనిమిగిలినవారినిఅన్యా యంచేయవద్దని, వడ్డిగూ డెంగ్రామంలో15 గృహాలకుపరిహారం రాలేదని,ఆర్.అండ్. ఆర్.రానివారుసుమారు60నుంచి70 మందివరకుఉన్నారని, వీరందరికీ న్యాయంజరిగినతర్వాతేగ్రామాన్నిఖాళీచేస్తామని,వివరించారు.ఇకనైనా పోలవరంప్రజెక్టుసంబంధిత, ఉన్నతాధికారులుమా బాధలు అర్ధంచేసుకొని,మే ముకోరుకున్నచోటగృహాలకుస్థలాలు ఇచ్చి,అన్నివిదలుగామ మ్మల్నిఆదుకోవాల ని,కోరారు.ఈ కార్యక్రమంలోమాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, మాజీ సొసైటీ చైర్మన్,ముత్యాల చంద్రశేఖర్,వడ్డిగూడెం గ్రామస్తులు,స్త్రీలు,యువకులుపిల్లలు ,తదితరులు పాల్గొన్నారు.



03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కాకినాడలో ఈ నెల 20న 1100 ఉద్యోగాల భర్తీకి జాబ్ మేళా

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 18:** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కాకినాడలో ఈ నెల 20న భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి జి. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.కాకినాడలోని రాజీవ్ గాంధీ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న ఈ జాబ్ మేళాలో సుమారు 18 ప్రముఖ ప్రైవేట్ సంస్థలు పాల్గొని వివిధ విభాగాల్లో దాదాపు 1,100 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆగస్టు 20, గురువారం ఉదయం 9 గంటలకు ఎస్ఆర్ఎంటీ మాల్ సమీపంలోని రాజీవ్ గాంధీ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.విద్యార్హతలుఈ ఉద్యోగాలకు ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, బీటెక్, డిప్లొమా, ఐటీఐ, డీబీఎం, ఫార్మసీ తదితర విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. పోస్టుల స్వభావాన్ని బట్టి పురుషులు, మహిళలు ఇద్దరూ జాబ్ మేళాకు హాజరు కావచ్చన్నారు.18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు.ఎంపికైన అభ్యర్థులకు పోస్టు, విద్యార్హత, అనుభవాన్ని బట్టి నెలకు రూ.15,000 నుంచి రూ.25,000 వరకు వేతనం లభించే అవకాశం ఉందని తెలిపారు.అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు, బయోడేటా (రెజ్యూమ్),వాటి జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని జిల్లా ఉపాధి అధికారి సూచించారు.జాబ్ మేళాకు సంబంధించిన మరిన్ని వివరాలు, సందేహాల కోసం 8639846568 నంబర్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.;

## ఘనంగా సునీల్ కుమార్ జన్మదిన వేడుకలు.

జన్మదిన వేళ సేవా స్ఫూర్తి చాటిన సునీల్ కుమార్.

**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 18;** రామచంద్రపురం 13వ అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఉత్తమ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అవార్డు గ్రహీత కప్పల సునీల్ కుమార్ జన్మదిన వేడుకలు మంగళవారం మండల కేంద్రమైన ఆలమూరులోని ఆయన నివాసం వద్ద ఘనంగా జరిగాయి. తన జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కిడ్నీ బాధితులకు 25 కేజీల బియ్యంతో పాటు నగదు అందజేసి తన సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. అనంతరం నాన్ భవిత పాఠశాలలో వికలాంగ విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి వారితో కలిసి ఆత్మీయంగా గడిపారు. జన్మదిన వేడుకలను ఆడంబరాలకు దూరంగా సేవా కార్యక్రమాలతో నిర్వహించడంపై పలువురు అభినందించారు. కాగా సునీల్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, న్యాయవాదులు, పత్రికా సోదరులు తరలివచ్చారు. ఆయన అభిమానులు పెద్ద సంఖ్యలో ఇంటికి చేరుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో సునీల్ కుమార్ నివాసం వద్ద సందడి నెలకొంది.



## జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పలివెల సుధాకర్



**మండపేట. పెన్ పవర్. ఆగస్టు 18.** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల సుధాకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో జగన్ కలిసి సుధాకర్ స్వీట్ బాక్స్ అందించారు. ఈ సందర్భంగా పార్టీ పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలని జగన్ సూచించినట్లు సుధాకర్ తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్లు ఆయన పేర్కొన్నారు. జగన్ ను కలిసిన వారిలో వైసీపీ నాయకులు పైడిమళ్ల రాజు, ఖండవల్లి వీర్రాజు ఉన్నారు.

## సూర్యారావుపేట స్థితిగతులను పరిశీలించిన ఎంపీడీవో



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 18;**మండలంలోని సూర్యారావుపేట గ్రామ పరిధిలో ప్రస్తుత స్థితిగతులను ఎంపీడీవో ఏ.రాజు, స్థానిక టిడిపి సీనియర్ నేత కాలా సాయిబాబాతో కలిసి క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కొన్ని మార్గాలు సిసి రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు.అలాగే ఎస్సీ కాలనీలో త్రాగునీటి సౌకర్యం సరిగా లేదని, స్థానికంగా నూతన వాటర్ ట్యాంకు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించామన్నారు. అలాగే నిర్మాణంలో ఉన్న వెల్నెస్ సెంటర్ భవనాన్ని పరిశీలించినట్లు తెలిపారు. అలాగే ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి గ్రామంలో పోలింగ్ బూతుల అనుకూలతను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందన్నారు. గుర్తించిన సమస్యలను ఉన్నతాధికారులకు, స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి తీసుకుని వెళ్లినట్లు అభివృద్ధికి కృషి చేస్తామని వారు తెలిపారు. అనంతరం ఎంపీడీవో రాజు పంచాయతీ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తు పలు సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శివ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి సుభాష్ కృషితో నాలుగు దశాబ్దాల కబేలా సమస్యకు శాశ్వత పరిష్కారం

ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట

కబేలా మూసివేతకు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాలు

కబేలా ప్రాంతాన్ని సందర్శించిన వాసంశెట్టి సత్యం





**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 18:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం రామచంద్రపురం రూరల్ మండలం చోడవరం గ్రామంలో గత నాలుగు దశాబ్దాలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ, పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్న కబేలా (పశు వధశాల) సమస్యకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో శాశ్వత పరిష్కారానికి మార్గం సుగమమైంది. మంత్రి సుభాష్ చొరవతో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండల కబేలా మూసివేతతో పాటు విద్యుత్ సరఫరా నిలిపివేతకు ఆదేశాలు జారీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. దీంతో స్థానిక ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

చోడవరం ప్రాంతంలోని కబేలాల కారణంగా సంవత్సరాలుగా దుర్వాసన, అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో పాటు, ప్రసిద్ధ ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించేందుకు వచ్చే భక్తులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు పేర్కొన్నారు. సమస్య పరిష్కారం కోసం నాలుగు దశాబ్దాలుగా ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని తెలిపారు.

రామచంద్రపురం ఎమ్మెల్యేగా, మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వాసంశెట్టి సుభాష్ దృష్టికి ప్రజలు సమస్యను తీసుకెళ్లడంతో ఆయన ప్రత్యేకంగా స్పందించారు. అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించి, ప్రజల విజ్ఞప్తులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో కబేలా మూసివేత ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు.

కబేలా ప్రాంతంలో అధికారుల చర్యలు

మంగళవారం పోలీసుల బందోబస్తు మధ్య మున్సిపల్, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కబేలా ప్రాంతానికి చేరుకుని చర్యలు చేపట్టారు. జేసీబీల సహాయంతో అక్కడ పేరుకుపోయిన పశు వ్యర్థాలు, చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. శానిటరీ సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు.

భవిష్యత్తులో తిరిగి పశువధ జరగకుండా కబేలా ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు.

కబేలా నిర్వాహకులకు ప్రత్యామ్నాయ జీవనోపాధికి హామీ

ప్రజల సమస్యను పరిష్కరించడంతో పాటు కబేలా నిర్వహణపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకుని మంత్రి సుభాష్ నిర్వాహకులు చుట్టుగుళ్ల యోషయా, కొత్తూరు చిట్టెమ్మ (మోషే)తో చర్చలు జరిపినట్లు తెలిపారు.వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న మంత్రి సుభాష్ విజయవాడ నుంచి ఫోన్ ద్వారా కబేలా నిర్వాహకుడు చుట్టుగుళ్ల యోషయాతో మాట్లాడి, అదే ప్రాంతంలో డెయిరీ ఫారం ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన అనుమతులు, ప్రభుత్వ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు.వాసంశెట్టి సత్యం కూడా నిర్వాహకులతో మాట్లాడి వారి జీవనోపాధికి భరోసా కల్పించారు. మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యం ఇచ్చిన హామీలపై తనకు పూర్తి నమ్మకం ఉందని యోషయా తెలిపారు. వారి మాటలను అంగీకరిస్తూ కబేలా నిర్వహణను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.కబేలా ప్రాంతాన్ని సందర్శించిన వాసంశెట్టి సత్యం

మంత్రి సుభాష్ అసెంబ్లీ సమావేశాల్లో ఉండటంతో ఆయన తండ్రి, కూటమి పార్టీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం కూటమి నాయకులతో కలిసి కబేలా ప్రాంతాన్ని సందర్శించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న సమస్యను మంత్రి సుభాష్ పరిష్కరించడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. గతంలో అనేక ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు హామీలు ఇచ్చినా సాధ్యం కాని పనిని మంత్రి సుభాష్ చేసి చూపించారని పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, ద్రాక్షారామం వచ్చే భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకున్న ఈ నిర్ణయాన్ని నియోజకవర్గ ప్రజలు స్వాగతిస్తున్నారని తెలిపారు.

**మంత్రి సుభాష్‌కు ప్రజల కృతజ్ఞతలు**

నాలుగు దశాబ్దాలుగా రామచంద్రపురం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కబేలా సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానిక ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. "గతంలో ఏ రాజకీయ నాయకుడు చేయలేని పని మంత్రి సుభాష్ చేసి చూపించారు" అంటూ పలువురు స్థానికులు ప్రశంసించారు.

ప్రజల సంక్షేమం, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మంత్రి సుభాష్ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం డీఎస్పీ ఎం.శేషు,తహశీల్దార్ బండి మృత్యుంజయరావు,సీఐ వెంకటనారాయణ,ఎస్సై నాగేశ్వరరావు, మున్సిపల్, పశు సంవర్ధక శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి నేతలను అణగదొక్కేందుకు కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు

తమ్మన శ్రీనివాస్‌ను చట్టపరంగా పోరాడి తిరిగి ఇంటికి తీసుకువస్తాం: మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 18;**

వైసిపి నేతలను అణగదొక్కేందుకు కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతున్నారని, తమ్మన శ్రీనివాస్‌ను చట్టపరంగా పోరాడి తిరిగి ఇంటికి తీసుకువస్తామని వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. వైయస్సార్సీపి మండల అధ్యక్షులు చెముడులంక మాజీ సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ కుటుంబ సభ్యులను మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను, అరెస్టులను తీవ్రంగా ఖండించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను తట్టుకోలేక, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రజల కోసం కష్టపడి పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తూ భయపెట్టే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. తమ్మన శ్రీనివాస్ సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, ఆయన భార్య తమ్మన సుబ్బలక్ష్మి కూడా ఆలమూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేశారని చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. అలాంటి కుటుంబాన్ని రాజకీయ కక్ష సాధింపులో భాగంగా కేసులు, అరెస్టులతో వేధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు.

బదుగువాని లంక, మూలస్థానం వద్ద నిర్మించిన రెండు బ్రిడ్జిలకు వ్యక్తిగత పేర్లు పెట్టుకునే ప్రయత్నాలపై రెండు గ్రామాల ప్రజల్లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా ఈ అంశంపై తమ్మన శ్రీనివాస్ ప్రశ్నించడం, ఫిర్యాదు చేయడం నేరం ఎలా అవుతుందని ప్రశ్నించారు. ప్రజల తరపున ప్రశ్నించిన నాయకుడిపై కక్షతో తప్పుడు కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. తమ్మన శ్రీనివాస్ పై విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో కేసు నమోదు చేసి, అనంతరం మరిన్ని కేసులను ఆయనపై మోపే ప్రయత్నం చేశారని చిర్ల జగ్గిరెడ్డి ఆరోపించారు. కోర్టును కూడా తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరించి 14 రోజుల రిమాండ్‌కు పంపించే పరిస్థితి తీసుకువచ్చారని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తనపై గతంలో ఏడు, ఎనిమిది కేసులు పెట్టినా, రాజకీయ ప్రత్యర్థులపై వ్యక్తిగత కక్షతో ఒక్క కేసు కూడా పెట్టలేదని చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. రాజకీయాలు ఉంటే తనతో చేయాలని, తన కుటుంబ సభ్యులు, తన సొంత కార్యకర్తలు, నాయకులను లక్ష్యంగా చేసుకోవడం రాజకీయ హుందాతనం కాదన్నారు. తమ్మన శ్రీనివాస్ తాను ఎలాంటి తప్పు చేయలేదనే నమ్మకంతో ధైర్యంగా చట్టం ముందు నిలబడ్డారని, అదే తమకు, కూటమి ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడా అని అన్నారు. అవసరమైతే పై కోర్టులను ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని, బెయిల్ కోసం చట్టపరమైన అన్ని మార్గాలను అనుసరిస్తామని స్పష్టం చేశారు. అక్రమ కేసులు, అరెస్టులతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను భయపెట్టడం కూటమి ప్రభుత్వానికి సాధ్యం కాదని చిర్ల జగ్గిరెడ్డి స్పష్టం చేశారు. కార్యకర్తల కుటుంబాలను కూడా రాజకీయ వేధింపులకు గురిచేయడం అత్యంత దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. తమ్మన శ్రీనివాస్ తో పాటు అరెస్టయిన కుటుంబ సభ్యులకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా నిలుస్తుందని, న్యాయపోరాటం చేసి వీలైనంత త్వరగా వారిని కేసుల నుంచి బయటకు తీసుకువచ్చేందుకు అన్ని చర్యలు చేపడతామని చిర్ల జగ్గిరెడ్డి హామీ ఇచ్చారు. రాజకీయ కక్ష సాధింపులకు స్వస్తి పలికి, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అక్రమ కేసులతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలను ఎవరూ అణగదొక్కలేరని, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజల పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని చిర్ల జగ్గిరెడ్డి స్పష్టం చేశారు. తమ్మన శ్రీనివాస్ ఆయన కుటుంబ సభ్యులకు న్యాయం జరిగే వరకు న్యాయపరంగానూ, రాజకీయంగానూ పోరాటం కొనసాగిస్తామని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైయస్సార్సీపి నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలపైఅవగాహన సదస్సు

-మోసాలపట్లప్రజలుఅప్రమత్తంగాఉండాలి.

-ఎటపాక సి.ఐ.కృష్ణ, వి.ఆర్.పురంఎస్.ఐ.సాధిక్



**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.18**

సమాజంలోనేరాలనుఅరికట్టడానికి,మహిళలు పిల్లలరక్షణకోసంప్రతిఒక్కరూచట్టాలపై అవగాహన పెంచుకోవాలని,ఎటపాక,సి.ఐ.కృష్ణ అన్నారు.మండలంలోనివడ్డిగూడెం గ్రామంలోని స్థానిక శివాలయంవద్ద మంగళవారంఎటపాక సర్కిల్,ఇన్‌స్పెక్టర్,కృష్ణ వి.ఆర్. పురం సబ్ ఇన్‌స్పెక్టర్.సాధిక్,పోలీసు సిబ్బంది.ఆధ్వ ర్యంలోఅవగాహన సభ ఏర్పాటు చేశారు.బాల్య వివా హాలపై హెచ్చరికచేశారు.ఈ సందర్భంగాఎటపాక సి.ఐ. కృష్ణ,మాట్లాడుతూ సమాజానికి చేటు తెచ్చే బాల్య వివా హాలను ఆపడంలో ఊరి ప్రజలంతా ముందుండాలని పిలుపునిచ్చారు. పద్దెనిమిది ఏళ్ల కన్నా చిన్న పిల్లలకు పెళ్లిళ్లు చేయడం చట్ట ప్రకారం పెద్ద నేరమని,అలా చేస్తే కఠిన చర్యలుఉంటాయని స్పష్టం చేశారు.అలాగే,ఈ రోజుల్లో ఫోన్లలో పెరిగిపోతున్న మోసాల పట్ల ఊళ్లల్లో ఉండే జనం చాలా జాగ్రత్తగా ఉండాలని,తెలియజేశారు. తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతాల వివరాలు, ఫోన్లకు వచ్చే రహస్య నంబర్లు చెప్పకూడదని, ఒకవేళ మోసపోతే వెంటనే పోలీసులను కలవాలని తెలిపారు.రహదారులు భద్రత -ఫోన్ల వాడకంపై సూచనలు రోడ్డుప్రమాదాలు జరగకుండాచూడాలని చెబుతూ హెల్మెట్ పెట్టుకోవడం కేవలం చట్టం కోసం కాదు, అది మీ కుటుంబానికి రక్షణ" అని అన్నారు. బైకులు నడిపేవాళ్లు తప్పకుండా హెల్మెట్ పెట్టుకోవాలని, నిర్లక్ష్యంగా వాహనాలు నడపకూడదని హెచ్చరించారు.అలాగే నేటి తరం సెల్‌ఫోన్ల వాడకంపై మాట్లాడుతూ.. "ఫోన్లను మంచి విషయాలు తెలుసు కోవడానికి, జ్ఞానాన్ని పెంచుకోవడానికి మాత్రమే వాడాలి. చెడు అలవాట్లకు లోనై జీవితాలను నాశనం చేసుకోవద్దు" అని యువతకు హితవు చెప్పారు.మహిళల చట్టాలపై ప్రత్యేక దృష్టి,మహిళలుచట్టాల ద్వారా వచ్చే రక్షణలు, ఆపద సమయంలో కాల్ చేయాల్సిన అత్యవసర నంబర్ల గురించి సబ్ ఇన్‌స్పెక్టర్ గ్రామస్తులకు వివరంగా చెప్పారు. మహిళల భద్రతకు తాము ఎల్లప్పుడూ తోడుగా ఉంటా మని మాట ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వడ్డిగూడెం గ్రామ పెద్దలు,మహిళలు,యువతి యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రికి అర్జున అవార్డు.. క్రీడా పురస్కారాల పూర్తి జాబితా...

- 2025 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా పురస్కారాలు
- మొత్తం 17 మంది క్రీడాకారులను వరించిన అర్జున పురస్కారం
- ఈ ఏడాది ఎవరికీ మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డు ప్రకటించని కేంద్రం
- చెస్ సంచలనం దివ్య దేశ్‌ముఖ్, అథ్లెట్ తేజస్విన్ శంకర్‌కు కూడా అర్జున
- పలువురు కోచ్‌లకు ద్రోణాచార్య, క్రీడా ప్రముఖులకు జీవన సాఫల్య పురస్కారాలు




**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా పురస్కారాలను మంగళవారం ప్రకటించింది. భారత బ్యాడ్మింటన్ దిగ్గజం, కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రిని ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు వరించింది. మహిళల డబుల్స్‌లో తన భాగస్వామి ట్రీసా జాలీతో కలిసి పుల్లెల గాయత్రి ఈ పురస్కారానికి ఎంపికైంది. వీరితో పాటు డెకాథ్లాన్ అథ్లెట్ తేజస్విన్ శంకర్, చెస్ ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ సహా మొత్తం 17 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులను ప్రకటించారు. అయితే, ఈ ఏడాది దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డును ఎవరికీ ప్రకటించకపోవడం గమనార్హం.సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఈ అవార్డుల జాబితాను విడుదల చేసింది. గత నాలుగేళ్లుగా నిలకడగా రాణిస్తూ, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించిన వారికి అర్జున అవార్డును ప్రదానం చేస్తారు. కామన్వెల్త్ క్రీడల్లో డెకాథ్లాన్‌లో పతకం గెలిచిన తొలి భారతీయ అథ్లెట్‌గా తేజస్విన్ శంకర్ చరిత్ర సృష్టించగా, ఫిడే మహిళల ప్రపంచ కప్ గెలుచుకుని దివ్య దేశ్‌ముఖ్ సంచలనం రేపారు. హాకీ క్రీడాకారుడు హార్దిక్ సింగ్ పేరు ఖేల్ రత్న కోసం పరిశీలనకు వచ్చినప్పటికీ, అతను పోటీ నుంచి తప్పుకోవడంతో ఈసారి ఎవరికీ ఈ పురస్కారం దక్కలేదని తెలిసింది.

సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు అరుమై నాయగంను అర్జున అవార్డు (జీవన సాఫల్యం) వరించింది. 1962 జకార్తా ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత జట్టులో ఆయన సభ్యుడు. కోచ్‌లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డులు ముగ్గురిని వరించాయి.

**అవార్డు గ్రహీతల పూర్తి జాబితా:**

అర్జున అవార్డు గ్రహీతలు (17 మంది)
తేజస్విన్ శంకర్, మహమ్మద్ అజ్మల్, ప్రియాంక గోస్వామి (అథ్లెటిక్స్)
ట్రీసా జాలీ, పుల్లెల గాయత్రి (బ్యాడ్మింటన్)
నరేందర్ బెర్వాల్ (బాక్సింగ్)
విదిత్ సంతోష్ గుజరాతీ, దివ్య దేశ్‌ముఖ్ (చెస్)
లాల్రెమ్సియామి, రాజ్‌కుమార్ పాల్ (హాకీ)
సుర్జీత్, పూజ (కబడ్డీ)
ధనుష్ శ్రీకాంత్, రుద్రాంశ్ ఖండేల్వాల్ (పారా షూటింగ్)
ఏక్తా భయాన్ (పారా అథ్లెటిక్స్)
అరవింద్ సింగ్ (రోయింగ్)
అఖిల్ షెయోరాన్ (షూటింగ్)
అర్జున అవార్డు (జీవన సాఫల్యం)
అరుమై నాయగం (ఫుట్‌బాల్)
ద్రోణాచార్య అవార్డు (కోచ్‌లు)
ఛోటే లాల్ యాదవ్ (బాక్సింగ్)
పర్వీర్ సింగ్ (అథ్లెటిక్స్)
నేహా నందకుమార్ చవాన్ (షూటింగ్)
జీవితకాల సాఫల్య పురస్కారం (ధ్యాన్‌చంద్ అవార్డు)
ధర్మేంద్ర సింగ్ యాదవ్ (బాక్సింగ్)
వీరేందర్ కుమార్ (రెజ్లింగ్)
రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్
ఆర్మీ పారాలింపిక్ నోడ్, పుణే

# 84కే 4 వికెట్లు.. మరో 288 రన్స్ చేస్తేనే లంక గెలిచేది.. లేకపోతే విజయం భారత్‌దే







**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ వర్సెస్ శ్రీలంకల మధ్య జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ నాలుగో రోజు ముగిసే సమయానికి టీమిండియా పూర్తి పైచేయి సాధించింది. ఆతిథ్య లంక జట్టు ముందు 372 పరుగుల భారీ లక్ష్యాన్ని పెట్టింది. ఇక ఇన్నింగ్స్ లో లభించిన 178 పరుగుల ఆధిక్యంతో నాలుగో రోజు బరిలోకి దిగిన భారత్, చివరకు శ్రీలంకను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టింది. లంక గెలవాలంటే ఇంకా 288 పరుగులు చేయాల్సి ఉండగా, టీమిండియాకు చారిత్రాత్మక విజయం సాధించడానికి కేవలం 6 వికెట్లు తీస్తే సరిపోతుంది. భారత జట్టు రెండో ఇన్నింగ్స్ ప్రదర్శన ఆశించిన స్థాయిలో కొనసాగలేదు. క్రమశిక్షణతో కూడిన లంక బౌలింగ్‌కు వరుసగా ఇండియన్ బ్యాటర్లు వికెట్లు పారేసుకోవడంతో జట్టు 193 పరుగులకే ఆలౌట్ అయింది. అయినప్పటికీ, తొలి ఇన్నింగ్స్‌లో సాధించిన 178 పరుగుల భారీ లీడ్ పుణ్యమా అని శ్రీలంక ముందు 372 పరుగుల టార్గెట్ ని ఉంచగలిగింది. గాలే పిచ్‌పై చివరి రోజు ఈ కొండంత స్కోరును ఛేజ్ చేయడం లంకకు కష్టమే అని చెప్పాలి.


**84/4 వద్ద నిలిచిన నాలుగో రోజు ఆట:**

లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆఖరి సెషన్‌లో భారత బౌలర్లు బ్రేకులు వేశారు. పక్కా ప్లానింగ్‌తో దాడి చేసిన టీమిండియా బౌలర్లు, లంక టాప్ ఆర్డర్‌ను దెబ్బతీస్తూ 4 కీలక వికెట్లను నేలకూల్చారు. వెలుతురు లేమి

కారణంగా 34 ఓవర్లు ముగిశాక నాలుగో రోజు ఆటను నిలిపివేసే సమయానికి శ్రీలంక 84 పరుగులకు 4 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో కూరుకుపోయింది. ప్రస్తుతం క్రీజులో సోనల్ దినూష (25 రన్స్), ధనంజయ డి సిల్వా (31) నాటౌట్ గా కొనసాగుతున్నారు. కాగా మ్యాచ్ రేపటికి వాయిదా పడినప్పటికీ, విజయం మాత్రం దాదాపు భారత్ సొంతమైనట్లే కనిపిస్తోంది.

# గిల్‌క్రిస్ట్ వరల్డ్ రికార్డ్ బ్రేక్ చేసిన పంత్.. టెస్టుల్లో 100 సిక్సర్లు పూర్తి!




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత వికెట్‌కీపర్-బ్యాటర్ రిషభ్ పంత్ టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ సుదీర్ఘ ఫార్మాట్‌లో 100 సిక్సర్లు పూర్తి చేసుకున్న తొలి భారతీయ బ్యాటర్‌గా అరుదైన మైలురాయిని అందుకని రికార్డు పుస్తకాల్లో తన పేరును లిఖించుకున్నాడు. భారత్ ఆడుతున్న తాజా టెస్ట్ మ్యాచ్‌లో తన ట్రేడ్‌మార్క్ అటాకింగ్ షాట్‌తో ఈ ఘనత సాధించాడు. అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే 100 లేదా అంతకంటే ఎక్కువ సిక్సర్లు బాదిన నాలుగో బ్యాటర్‌గా పంత్ నిలిచాడు.

రిషభ్ పంత్ అటాకింగ్ శైలి ఎంత ప్రమాదకరమైనదో అతని గణాంకాలే చెబుతున్నాయి. టెస్టుల్లో ప్రతి 49 బంతులకు ఒక సిక్సర్ చొప్పున బాది పంత్ సంచలనం సృష్టించాడు. ఈ విషయంలో దిగ్గజ కీపర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ (ప్రతి 67 బంతులకు ఒక సిక్సర్) రికార్డును కూడా పంత్ సునాయాసంగా బ్రేక్ చేసేశాడు.

**ఒత్తిడిలోనూ పంత్ సూపర్ హాఫ్ సెంచరీ:**

తరచుగా విమర్శలు ఎదుర్కొనే పంత్, కష్టసమయంలో జట్టుకు కొండంత అండగా నిలిచాడు. మొదటి సెషన్‌లో భారత్ వరుసగా వికెట్లు కోల్పోయి కుప్పకూలే ప్రమాదంలో పడిన వేళ, పంత్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. ఈ క్రమంలోనే పంత్ తన టెస్ట్ కెరీర్‌లో 20వ అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. జట్టుకు టాప్ స్కోరర్‌గా నిలిచి, భారత జట్టు ఆధిక్యాన్ని 350 పరుగుల దాకా తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాడు.

టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన విధ్వంసకర బ్యాటర్ల ఎలైట్ క్లబ్‌లో పంత్ చేరాడు. ఈ జాబితాలో టాప్-4లో ఉన్న ఆటగాళ్ళు:

బెన్ స్టోక్స్ - 138 సిక్సర్లు
బ్రెండన్ మెక్‌కలమ్ -107 సిక్సర్లు
రిషభ్ పంత్ - 100లి సిక్సర్లు
ఆడమ్ గిల్‌క్రిస్ట్ - 100 సిక్సర్లు

# 2026లో రౌడీ దర్శనం లేనట్లేనా?







విజయ్ దేవరకొండ కమ్ బ్యాక్ మూవీ కోసం తన అభిమానులు చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. గీత గోవిందం విజయ్ చివరి క్లీన్ హిట్. ఆ తర్వాత తన సినిమాలన్నీ నిరాశపరిచాయి. గత ఏడాది వచ్చిన ‘కింగ్డమ్’తో బలంగా పుంజుకుంటాడనే అంచనాలు కలిగాయి కానీ.. అది నిజం కాలేదు. ఆ సినిమా ఓ మాదిరిగా ఆడి వెళ్లిపోయింది.ఐతే విజయ్‌కి ఉన్న అదృష్టం ఏంటంటే.. ఎన్ని ఫ్లాపులు ఇచ్చినా తన ఫాలోయింగ్, మార్కెట్ అలాగే కొనసాగుతున్నాయి. క్రేజీ ప్రాజెక్టులు తన చెంతకు వస్తున్నాయి. గత ఏడాది అతను ఒకేసారి రెండు భారీ చిత్రాలను మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. అందులో ఒకటి రణబాలి కాగా.. ఇంకోటి రౌడీ జనార్ధన. వీటిలో మొదటిది సెప్టెంబరులో, రెండోది డిసెంబర్లో రిలీజ్ కావాల్సింది. రెంటికీ రిలీజ్ డేట్లు కూడా ఇచ్చారు. కానీ ఈ రెండూ అనుకున్నట్లుగా విడుదల కావట్లేదు.‘రణబాలి’ వాయిదా అని ఇంతకుముందే క్లారిటీ వచ్చేసింది. ఇప్పుడు ‘రౌడీ జనార్ధన’ సైతం డిసెంబరులో రిలీజ్ కాదని తెలుస్తోంది. ‘రణబాలి’ ముందే ఆలస్యం కాగా.. హీరోయిన్ రష్మిక మందన్నా గాయంతో మరింత లేట్ అవుతోంది. ఈ సినిమా షూట్ ఇంకా 30 శాతం దాకా మిగిలి ఉన్నట్లు సమాచారం. మరోవైపు ‘రౌడీ జనార్ధన’ వర్క్ 50 శాతం దాకా బ్యాలెన్స్ ఉందట. ఈ రెంటిలో ఏదీ ఈ ఏడాదిలో పూర్తయి ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు లేదు. కాబట్టి రౌడీ దర్శనం కోసం 2027 వరకు ఎదురు చూడాల్సిందే. ఐతే వచ్చే ఏడాది ఈ రెంటితో పాటు మరో చిత్రంతోనూ విజయ్ ప్రేక్షకులను పలకరించే అవకాశముంది. రణబాలి, రౌడీ జనార్ధన వచ్చే ఏడాది ప్రథమార్ధంలోనే రిలీజ్ అవుతాయి. ‘హాయ్ నాన్న’ ఫేమ్ శౌర్యువ్‌తో అనౌన్స్ చేసిన సినిమాను సెకండాఫ్‌లో ప్రేక్షకుల ముందుకు తెచ్చే అవకాశముంది. కాబట్టి ఈ ఏడాది సినిమా లేకపోయినా.. వచ్చే ఏడాది విజయ్ అభిమానులను మూడు చిత్రాలతో మురిపించే ఛాన్సుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com